

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 12 | సంచిక : 10 | జూన్ 2007

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


తాడినాడ .......... 02-02-07
కాపవరం .......... 12-02-07
పాలకొల్లు .......... 18-03-07
ఆత్రేయపురం ..... 09-05-07



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 02-02-07, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం జరుపుకునే ఈ జ్ఞానయజ్ఞాలు మీ శారీరక, మానసిక ఆరోగ్యానికి సహకరిస్తాయి. జపం, ధ్యానం చేయటం వలన ఏ ఫలితాన్ని పొందుతామో, మనం చేతితో ఏదైనా మంచిపని చేయటం వలన కూడా అదే ఫలితాన్ని పొందుతాము. ధ్యానానికి ఎంత శక్తి ఉందో దానానికి అంతే శక్తి ఉంది అని పెద్దలు చెపుతారు. ఏవో గొప్పలు, గౌరవాలు ఆశించి చేస్తే అది దానం కాదు. గౌరవాలతో సంబంధం లేకుండా అక్కడ అవసరాన్ని బట్టి దానం చేస్తే జప ధ్యానముల వలన ఎటువంటి ఫలితం వస్తుందో అటువంటి ఫలితం దానం వలన కూడా వస్తుంది అని శాస్త్రం చెపుతోంది. చాలామంది జపం గురించి అడుగుతూ ఉంటారు. మన శరీరాన్ని సబ్బుతో ఎలా శుభ్రం చేసుకొంటామో అలాగ మన మనస్సును శుభ్రం చేసుకోవటానికి జపధ్యానములు సబ్బులులాగ ఉపయోగపడతాయి. జన్మాంతర సంస్కారమును బట్టి ఏదైనా అవతారపురుషుని స్మరించుకోవచ్చు లేకపోతే గురువుతో అనుబంధం ఉంటే గురువు యొక్క నామాన్ని స్మరించుకోవచ్చు, అది మీ సంస్కారమును బట్టి ఉంటుంది. మన గురువు అమెరికాలో ఉన్నా ఫరవాలేదు. గురువు అంటే శరీరం కాదు, గురువు అంటే చైతన్యం, ఆత్మ. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకోవటం వలన అది సత్సంగం అవుతుంది. గురువు అంటే ఎవరు సత్. గురువుతో మానసికంగా సంగమం పెట్టుకోవటం వలన అది సత్సంగం అవుతుంది. ఒక స్థితికి వచ్చాక గురువు దేహంతో మనకు పని లేదు, మానసిక అనుబంధం సరిపోతుంది. గురువుతో మానసిక

అనుబంధం వలన మన చైతన్యస్థాయి పెరుగుతుంది, బాగుపడాలనే ఇన్‌స్పిరేషన్ వస్తుంది. మనం ఎవరిదైనా జీవితచరిత్రలు తీసుకొనేటప్పుడు కూడా బాగా సక్సెస్ అయినవారి జీవితం తీసుకోవాలి, అది ఆధ్యాత్మికం అవ్వవచ్చు, భౌతికం అవ్వవచ్చు. ఎందుకు వారు అభివృద్ధిలోనికి వచ్చారు, అలా మనం ఎందుకు అభివృద్ధిలోనికి రాలేకపోతున్నాము అనే విచారణ ఉండాలి. మురుగునార్ భగవాన్‌తో చాలా సన్నిహితంగా ఉండి ఉన్నతస్థితిని పొందారు. అనేకమంది మహర్షులు, మహాత్ములు ఉండవచ్చుకాని నాకు భగవాన్ రూపం, నామం చాలు అనేవారు మురుగునార్. మన ప్రారబ్ధాన్ని బట్టి వచ్చిన స్నేహాలు, విరోధాలు నిలబడవు. ప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి డబ్బు వస్తూ ఉంటుంది, ఒకోసారి పోతూ ఉంటుంది. మనం నేర్చుకొనే విద్య నిజమైతే మనకు వినయం వస్తుంది. కొంతమంది లోపల గర్వం పెట్టుకొంటారు, పైకి వినయం నటిస్తారు. ఆ వేషాలు భగవంతుడి దగ్గర పనికిరావు. మనం మనుషులను మోసం చేయగలము కాని భగవంతుడిని మోసం చేయలేము.

మన జీవితంలో ఆటుపోటులు ఉంటాయి. మనం భగవంతుడి పాదాలను విడిచిపెట్టకూడదు. ఎందుచేతనంటే ఆయన దయ లేకుండా మనం ఏమీ సాధించలేము. మీలో ఎవరైనా అదృష్టవంతులు ఉంటే అది భగవంతుడు మనకు ఇచ్చిందే కాని మన తెలివితేటల వలన సాధించాము అని అనుకోవద్దు. మనకు భక్తి లేదా అంటే ఎంతో కొంత భక్తి ఉంది. కాని లోపల గుణాలు ఉంటాయి, అవి ఎన్నో జన్మలనుండి వస్తున్నాయి, అవి మనలను కుదురుగా ఉండనివ్వవు. ఒకోసారి సత్వగుణం, ఒకోసారి రజోగుణం, ఒకోసారి తమోగుణం ఉంటుంది. సత్వగుణం ఉన్నవాడికి జ్ఞానం సంపాదించాలని ఉంటుంది, రజోగుణం ఉన్నవాడికి ధనార్జన మీద దృష్టి ఉంటుంది, తమోగుణం ఉన్నవాడికి ఎంతసేపు తిండి, నిద్ర. మనకు బ్రతుకు తీరు లక్షణాలు లేకపోయినా మూఢనమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలో అనేకమంది మోసగాళ్ళు ఉంటారు వారు అమాయకులను దోచుకుంటూ ఉంటారు. ఎవరైనా మనలను మొదటిసారి మోసం చేస్తే వాడిదే పొరపాటు. రెండోసారి కూడా వాడి మోసంలో మనం పడిపోయాము అనుకోండి వాడిది పొరపాటుకాదు మనదే పొరపాటు. లెక్కలు లేకుండా మనకు రోజు గడవదు. లెక్కలు లేకుండా జీవితం గడపటం ఎంత కష్టమో ఆత్మశాంతి లేకుండా సుఖంగా జీవితం గడపటం కూడా అంతే కష్టం. ఆత్మశాంతిని కనుక మీరు సంపాదిస్తే వందసంవత్సరాలు వందక్షణాలుగా వెళ్ళిపోతాయి, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. జాగ్రదవస్థలో, స్వప్నావస్థలో జరిగేవి అన్నీ నిజాలుకాదు, నిజం వలె మనకు కనిపిస్తున్నాయి. దేహము నేను అనే తలంపు ఎంత నిజమో బయట జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. వాటిని మనం పట్టించుకోకూడదు. ఇప్పుడు

మనం కాశీ వెళుతున్నాము అనుకోండి, దారిలో ఎవరో కనబడతారు మాట్లాడతాము, మనం కాశీ వెళ్లే గొడవలో ఉంటాము కాని వారిని పట్టించుకోము. అలాగే మన గమ్యం మోక్షం, అది కాకుండా మీరు ఎన్ని గొప్ప విషయాలు సంపాదించినా స్వప్నంతో సమానము.

మనం కాశీ వెళ్ళేటప్పుడు కాశీని ఎలా దృష్టిలో పెట్టుకొంటామో అలాగే మనం మోక్షాన్ని దృష్టిలో పెట్టుకొంటే పెద్ద గొడవలు వచ్చినా, చిన్న గొడవలు వచ్చినా అవి మన శరీరాన్ని కాని, మనస్సును కాని ముట్టుకోవు, ఎలాగ వచ్చినవి అలాగే పోతాయి. మనం గమ్యాన్ని మర్చిపోతే మాత్రం చిన్న గొడవలు కూడా పెద్ద గొడవలుగా మనకు కనబడతాయి. జపం, ధ్యానం చేయటం వలన అవసరం లేని తలంపులు తగ్గిపోతాయి, భగవంతుడికి దగ్గర అవుతాము. సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు. కొంతమంది కారణం లేకుండా ఉద్రేకపడతారు. మాష్టారు లెక్క ఎలా చేయాలో చెపుతారు, లెక్క మనమే చేయాలి. లెక్క ఎలా చేయాలో చెప్పేది జ్ఞానమార్గం, లెక్క చేయటం అనేది కర్మమార్గం. చేనుకు ఎరువు వేసినట్లుగా ఈ మార్గాలకు సపోర్టుగా ఉండేది భక్తి మార్గం. కర్మమార్గంలో, జ్ఞానమార్గంలో బాగా వికసించాలంటే భక్తిని ఉపయోగించు కోవాలి. ఈ మూడుమార్గాలను సమన్వయం చేసుకోవాలి. మనం ఏదో ఆలోచిస్తాము అనుకోండి, ఇది మంచిది అని మనకు అనిపించినా దానిని మనం చేయలేము అనుకోండి అంటే మనం కర్మ మార్గంలో లేమని అర్థం. అది ఎలా చేయాలో మనకు తెలిసినా మనలో ఏదో వాసన దానిని చేయనివ్వదు. అంటే ప్రాక్టికల్‌గా మనం ఫెయిల్ అవుతున్నాము. ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అయినా మనకు డిగ్రీ ఇవ్వరు. మనం ఎవరిని చూసి అసూయపడకూడదు. మనిషిని చూసి అసూయపడు తున్నాము అంటే మనం కర్మమార్గంలో ఫెయిల్ అవుతున్నాము. ఈ లోకం అనేది ట్రయినింగ్ గ్రౌండ్. ఆయన చెప్పినట్లుగా మనం జీవిస్తున్నామా లేదా అనేది భగవంతుడు చూస్తాడు. ఆయన చెప్పినట్లుగా జీవిస్తే మనకు మోక్షం ఇస్తాడు లేకపోతే శరీరాలు ఇస్తాడు. అంటే మరల జన్మలు, నామాలు, రూపాలు. ఈ ప్రపంచం అంతా స్వప్నం అని భగవంతుడికి తెలుసు. నేను మీకు నాలుగు మంచిమాటలు చెపుతున్నాను, ఆ మాటలు చెప్పటంలో నా ఉద్దేశ్యం ఏమిటి అని భగవంతుడు చూస్తాడు కాని నేను చెప్పటం ఆయన చూడడు. మనం ఎవరితోనైనా మాట్లాడుతున్నాము అనుకోండి, ఎందుకు మాట్లాడుతున్నాము అని చూస్తాడు. మనం మాట్లాడటం లేదు అనుకోండి ఎందుకు మాట్లాడటం లేదు అని చూస్తాడు అంటే లోపల తలంపు చూస్తాడు. ఉన్న వస్తువు ఒక్కటే, అది మన హృదయంలోనే ఉంది, దానిని అనుభవైకవేద్యం చేసుకోవాలి అని దృష్టిలో పెట్టుకొంటే మీ ప్రారబ్ధం మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా, మిమ్మల్ని దురదృష్టం వెంటాడుతూ ఉన్నా, అదృష్టం వెంటాడుతున్నా దాని ప్రభావం మీ

మనస్సు మీద పడదు. మనం పాడైపోవటానికి మన మనస్సే కారణం. మనం మనస్సుతో తాదాత్మ్యం పొందుతున్నాము కాబట్టి బయట గొడవలు అన్నీ నిజంలాగ మనకు కనబడు తున్నాము. మనస్సులో మీకు తాదాత్మ్యం లేదు అనుకోండి ఏమీలేదు, గౌరవం అగౌరవం, ధనం, దారిద్ర్యం ఇవి ఏమీ మిమ్మల్ని ముట్టుకోవు. ఈ పెంట అంతా మనస్సులోనే ఉంది. మనస్సుతో తాదాత్మ్యం తగ్గించుకోవటానికే జపం. మనం గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొంటే చిల్లరగొడవలు అన్నీ పోతాయి. మనకు గమ్యం మీద శ్రద్ధ లేదు అనుకోండి ఈ చిల్లరగొడవ లన్నింటిని కీసర బాసర చేసేసి పెద్దగొడవలుగా చేసేసి మీ మనస్సు మిమ్మల్ని పాడుచేస్తుంది. అందుచేత గమ్యాన్ని దృష్టిలో పెట్టుకోండి, మనస్సులో తాదాత్మ్యం తగ్గించుకోండి.

మన ఇంట్లో ఉన్న వ్యక్తులతో మనకు సంబంధం లేదు, గురువుతో అనుబంధం ముఖ్యం. ప్రారబ్ధాన్ని బట్టి ఇంట్లో ఉన్న వ్యక్తులు వస్తారు, ప్రారబ్ధం అయిపోగానే బయటకు పోతారు. కాని గురువుతో ఉన్న అనుబంధం అలా కాదు, మనకు జ్ఞానం కలిగేవరకూ ప్రతిజన్మలోనూ గురువు మనలను వెంటాడతాడు. నీవు జ్ఞానం సంపాదిస్తే బాహ్యంగా పనులు చేసే వారందరికంటే నీ ద్వారా సృష్టికి మంచి జరుగుతుంది. జ్ఞానం పట్ల మనకు జిజ్ఞాస ఉండాలి, దాని తాలుక స్నేహాలు ఉండాలి. మీలో ఉన్న దోషాలను, బలహీనతలను భగవంతుడు మీకు చూపిస్తూ ఉంటాడు. ఇందులో ఏముంది ఇదొక అలవాటు, ఇందులో ఏముంది ఇది ఒక తలంపు, వీటిలో నుండి బయటకు వస్తే నీవు బాగుపడతావు అని లోపల నుండి చెపుతూ వాటిలో నుండి బయటకు వచ్చే ప్రేరణ నీకు కలుగజేస్తాడు, నీకు శక్తిని ఇస్తాడు. భక్తిలేని వాడికి సాధన అంటే ఏమిటో అర్థం కాదు.

మనకు ఏదో కోరిక వస్తూ ఉంటుంది. ఆ కోరిక నెరవేరిపోతే ఇంక శాంతే అనుకొంటాము. నెరవేరిన కోరిక వలన మనకు శాంతి రాదు, అది ఇంకో వంద కోరికలను తీసుకొని వస్తుంది. నేను చెపుతున్నాను, మీరు వినవలసిందే అని బలవంతంగా చెప్పే మాటలు కాదు. మీరు ఆలోచించుకోండి, మీకు పనికి వస్తే తీసుకోండి. మిమ్మల్ని రమణ భక్తులుగా తయారుచేయాలని మాకు లేదు, మాకు ఆర్గనైజేషన్ అక్కరలేదు, మీరు బాగుపడటం ముఖ్యం. మీకు శాంతి లేదు అనుకోండి, రమణమహర్షి చాలా గొప్పవాడు అని చెప్పటం వలన మీకు ఏమి కలిసివస్తుంది. బాహ్యమైన కర్మలను భగవంతుడు చూడడు, నీవు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు. నీకు ఇష్టమైన భగవంతుడి నామాన్ని చేసుకో, నామాన్ని విడిచిపెట్టవద్దు. ప్రశాంతంగా ఉండి నామం చేసుకోవటం వలన మీ మనస్సుకు నామం అలవాటు అయిపోతుంది, అప్పుడు గాఢనిద్రలో కూడా మీ మనస్సు నామం చేసేస్తుంది. కొంతమంది మంచిపనులు చేయాలని చేయరు, చేయకుండా

ఉండలేరు కాబట్టి చేస్తారు, మనం లోపల చూసుకోవాలి. మనకు రజోగుణం ఉంటే తగ్గించుకోవాలి, తమోగుణం ఉంటే తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని పెంచుకోవాలి. సత్వగుణం భగవంతుడి పాదాల దగ్గరకు చేరటానికి దారిచూపిస్తుంది. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అది నీ మనస్సుతోటి, దేహంతోటి, లోకంతోటి, పుణ్యపాపాలతోటి సంబంధం లేకుండా ఉంది. ఇంతవరకు ఈ ప్రపంచంలో ఎంగిలికాని వస్తువు నీ హృదయంలో ఉన్న నిజం ఒక్కటి మాత్రమే. దాని గురించి మాటలతో చెప్పలేము. ఆ వస్తువు గురించి చెప్పేవారు కూడ నూటికి నూరుపాళ్ళు న్యాయం చేయలేరు. వారు ఎంతవరకు చెప్పగలరో అంతవరకు చెపుతారు కాని సంపూర్ణంగా చెప్పటం సాధ్యంకాదు అందుచేత చెప్పిచెప్పి మౌనంగా ఉంటారు. ఆ మౌనంలో ఆ స్థితి అందుతుంది.

మనం అవసరమైతే మాట్లాడాలి, అవసరమైతే పనిచేయాలి. మన ఆలోచనలో, మాటలో, పనిలో నేను కలుగజేసుకోకుండా చూసుకోవాలి. నేను యొక్క ప్రేరణ వలన మనం మాట్లాడకూడదు, పని చేయకూడదు. దొంగనేను యొక్క ప్రేరణగా పని చేస్తాము అనుకోండి, దుఃఖం, అశాంతి మిగులుతాయి. ఈ దొంగ నేను వ్యవహారాలలో కలుగజేసుకోకుండా చూసుకొంటే అది నెమ్మదిగా పల్చబడిపోతుంది. నేను, నేను అనేది కూడా ఒక తలంపే, అది ప్రథమతలంపు. అది దేవుడి దగ్గర నుండి వస్తోంది. మిగతా తలంపులను అన్నింటిని గెంటుకొని ఈ నేను అనే తలంపును గట్టిగా పట్టుకొని అది ఎక్కడ పుట్టి వస్తోందో అక్కడకు చేరుకొంటే భగవంతుడు మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అది కడసారి జన్మ. జపం, ధ్యానం, ప్రాణాయామం ఇవి అన్నీ మనోనిగ్రహానికి, ఇంద్రియ నిగ్రహానికి సహకరిస్తాయి. భగవంతుడికి రూపం లేదు, నామం లేదు. మనం ఎంతసేపు ఏదో రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నాము. మన రూపబుద్ధిని, నామబుద్ధిని పోగొట్టటానికే భగవంతుడు రూపం ధరించి వస్తున్నాడు. ఆయన రూపాన్ని, పేరును పట్టుకొంటే మన నామరూపములనుండి విడుదల పొందుతాము, అందుచేతనే భగవంతుడు అవతారం ధరించి వస్తున్నాడు. నామరూపములే మనిషిని బంధిస్తున్నాయి. నామరూపము లను తీసేస్తే సృష్టి లేదు. ఫలానా పేరు నాది, ఫలానా రూపం నాది అని అనుకొంటున్నావు కదా, ఈ రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి నిన్ను విడిపించటానికే భగవంతుడు గురురూపంలో వచ్చి నీకు కనిపిస్తున్నాడు. వివేకానందుడికి సంబంధాలు వస్తున్నాయి, ఈ సంవత్సరం పెళ్లి అయిపోతుంది అనుకొనేవారు. వాడికి పెళ్లి ఏమిటి? వాడికి పెళ్ళాం పుట్టలేదు అనేవారు రామకృష్ణ పరమహంస. పెళ్లిళ్ళు కూడా మన ఇష్టం కాదు. అంతా ముందే నిర్ణయింపబడి ఆ రూపాలు కిందకు వస్తాయి. అంతా భగవంతుడే, చేసేది అంతా ఆయనే, మనం అసలు లేనే లేము. నిజమైన గురువు ఎవడు భక్తులను, శిష్యులను

పోగుచేసుకోడు, ఆ అవసరం వాడికి లేదు. కేవలం నీవు చేసే సాధనల వలన, తపస్సు వలన భగవంతుడు వ్యక్తమవ్వడు. ఆయన దయ ఉండాలి. మనం కృషి చేయాలి. మనం చేసే కృషి ద్వారా ఆయన అనుగ్రహానికి పాత్రులమవ్వాలి. నీవే ఉన్నావు, నేను లేను, జరిగేది నీ సంకల్పమే అని ఆయనకు పరిపూర్ణంగా శరణాగతి చేసిన వాడిని మాత్రమే ఆత్మజ్ఞానంతో అలంకరిస్తాడు. మీకు గురువు పేరు జ్ఞాపకం వస్తోంది అనుకోండి, గురువు మీద ప్రేమ, ఇష్టం కలుగుతోంది అనుకోండి అది మీ తెలివితేటల వలన కాదు, ఆయన అనుగ్రహం వలన కలుగుతోంది. చిన్న చిన్న గొడవలను పెద్ద పెద్ద గొడవలుగా చూపించేది మనస్సే. మనం పాడైపోవటానికి కారణాలు, అలవాట్లు, వాసనలు ఇవి అన్నీ మనస్సులోనే ఉన్నాయి, ఈ గారిడీ అంతా చేసేది మనస్సే. మనస్సులో ఉన్న వాసనలు, అలవాట్లు ఇవి అన్నీ ధ్వంసమయ్యే వరకు మీకు వెయ్యి కోట్ల డబ్బు ఉన్నా, వంద డిగ్రీలు ఉన్నా, గొప్ప పదవులు ఉన్నా మీకు జ్ఞానం రాదు.

కొంతమందికి అన్నీ ఉంటాయి, ఏమి తిన్నా అరగదు, మజ్జిగ అన్నం తిని కాలక్షేపం చేస్తారు, అదొక రకమైన ప్రారబ్ధం. మీకు బ్యాంకులో డబ్బు ఉంది, వేయి ఎకరాల పొలం ఉంది, మాకు రోజులు బాగా వెళ్ళిపోతాయి అని ఎవరూ అనుకోవద్దు. మీ ప్రారబ్ధంలో ఏమి ఉందో మీకు ఏమి తెలుసు, అది భగవంతుడికి తెలుసు. డబ్బు, పదవులు ఇవిఅన్నీ దేహప్రారబ్ధంలో ఉంటే వస్తాయి. ఇవి అన్నీ నిజం కాదు, ఇది అంతా స్వప్నమే. మోక్షాన్ని గమ్యంగా పెట్టుకో. ఏది నిజమో మనకు తెలియకపోయినా గురువుకు తెలుస్తూ ఉంటుంది, ఆ నిజం దగ్గరకు మనలను తీసుకొని వెళ్ళే వరకు వేలాది జన్మలు మనలను వెంటాడుతూ వస్తాడు. కొంతమందిని మాటలతో, కొంతమందిని పాటలతో అనుగ్రహిస్తాడు. ఆయన మాట అనుగ్రహం, చేత అనుగ్రహం, మౌనం అనుగ్రహం, అంతా అనుగ్రహమే. పులి నోటిలో పడ్డ మాంసపు ముక్క ఎలా బయటకు రాదో అలాగ ఒక్కసారి గురువు అనుగ్రహంలో పడినవాడు బయటకు రాలేడు. ఇది నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. గురువు అంటే ఆత్మ. మనం దేహమాత్రులం కాబట్టి, ఆయన కూడా దేహం ధరించి మనలాగ ఆయనకు కూడా దేహం ఉందని అనిపింపచేసి మనకు భోదిస్తాడు, ఆయన గురువు. జపం ఎంతకాలం చేయమంటారు అంటే అది సహజం అయ్యేవరకు చెయ్యి, నీ ప్రయత్నం లేకుండా సహజంగా నీ ముక్కులో గాలి ఎలా తిరుగుతోందో అలాగ సహజం అయ్యే వరకు నీవు జపాన్ని విడిచిపెట్టకు, చేస్తూనే ఉండు. సత్పురుషుల దగ్గర కూర్చొని మనం పిచ్చాపాటి మాటలు చెప్పినా కాని వారి నోటివెంట వచ్చేది జ్ఞానమే. జ్ఞానం తప్పించి వారి దగ్గర ఏమీ లేదు. మల్లెపూవు అంటే మనకు ఇష్టం లేకపోయినా మల్లెపూవు దగ్గర కూర్చొంటే మంచివాసన వస్తుంది కాని చెడ్డవాసన రాదు. చెడ్డవాసన ఎలా ఉంటుందో దానికి తెలియదు, సత్పురుషుడు అటువంటివాడు. నీవు పూజ చేసిన, జపం చేసిన, ధ్యానం చేసినా, ఏ ప్రయత్నం

చేసినా భగవంతుడిలో ఐక్యం అవ్వాలి, అదే మీ జీవిత గమ్యం. అక్కడో గెడ్డపార, అక్కడో గెడ్డపార వేస్తే నీళ్ళు ఎలా వస్తాయి. ఒక్కచోటే తవ్వితే నీళ్ళు వస్తాయి. రోజుకు ఒకోరకంగా ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? చపలచిత్తుడికి జ్ఞానమా? మానసికబలం లేనివాడికి జ్ఞానమా? శరీరంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే రోగాలు ఎక్కువగా వస్తాయి. చపలచిత్తుడు, మానసికబలం లేనివాడు ప్రపంచంలోని అన్ని ఆకర్షణలకు లోబడిపోతాడు. ఇన్ని గంటలు విని నాన్నగారు చెప్పినవి నిజంకాదు అని ఎవడో అంటే, వాడు చెప్పేది కూడా నిజమేనేమో అనుకొంటాడు దానికి కారణం మీకు మానసిక బలం లేకపోవటం, ఏకాగ్రత, పవిత్రత లేకపోవటం. మానసికబలం లేకపోవటం వలన అలా అనుకొంటున్నాము అని మీకు తెలియటం లేదు.

వారిలాగ ఉంటే బాగుండును, వీరిలాగ ఉంటే బాగుండును అనుకొంటారు. ఎంతమందిలాగ ఉంటారు. అలా అనుకోవటం వలన మీరు శుభ్రంగా పాడైపోతారు, చివరకు కుళ్ళిపోతారు. వారి పద్ధతిలో వారు ఉన్నారు, అలాగ ఉండాలని మీరు అనుకోవటం ఎందుకు? ఎవడికో క్యాన్సర్ వచ్చింది, నాకు కూడా క్యాన్సర్ రావాలని అనుకొంటారా? వారిలాగ, వీరిలాగ ఉండకు, నీ నిదానంలో నీవు ఉండు. కొంతమంది అస్తవ్యస్తంగా ఉంటారు. ఏదైనా చెపితే అదీ నిజమేనండి, ఇదీ నిజమేనండి అంటారు. ఇన్ని నిజాలు ఉంటాయా లోకంలో. జపం చేయటం వలన అస్తవ్యస్తమైన తలంపులు అన్నీ పోతాయి. జపం చేయటం వలన భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఒక క్రమశిక్షణ వస్తుంది. కొంతమంది డబ్బు ఉన్నా భోగం తగ్గించుకొంటారు, అది ఒక రకమైన యజ్ఞం. మీరు తినగా, మీరు అనుభవించగా మిగిలిన డబ్బును ఇతరులకు సాయం చేయండి, అది ద్రవ్యయజ్ఞం. ఇప్పుడు మనం చెప్పకొనే మాటలు జ్ఞానయజ్ఞం. నీకు ఏదైనా మంచి తెలిస్తే నాకు చెప్పాలి, నాకు ఏదైనా మంచి తెలిస్తే మీకు చెప్పాలి, పరస్పరం ఒకరిని ఒకరు అర్థం చేసుకొని హృదయం యొక్క లోతులు పెంచుకోవాలి, యజ్ఞాలలో జపయజ్ఞం నేను అని భగవంతుడు చెప్పాడు. డబ్బు ఖర్చు లేనిది, శ్రమ లేనిది, కాళ్ళుచేతులు కదపకుండా చేసుకొనేది, పాలు పంచదార పుష్పాలు పసుపు కుంకుమలతో పని లేకుండా చేసుకొనేది జపయజ్ఞం. జపయజ్ఞాన్ని విడిచిపెట్టవద్దు, మీరు గమ్యానికి వచ్చేస్తారు అది భగవాన్ ఉవాచ. అయితే నామం మీద మనకు గౌరవం లేదు, ఇంక మనస్సు ఎలా నిలబడుతుంది. ఎకరం రు. 200/-లు, రు. 300/-లు రోజులలో బెంగుళూరులో ఇంజనీరుగా పనిచేసే యూరప్‌వాడు రమణోత్సవానికి వచ్చి రు. 2,000/-లు ఇచ్చి భగవాన్‌కి యాపిల్స్, బత్తాయిలు కొని ఇవ్వండి అని చెప్పి రెండు రోజులు ఉండి వెళ్ళిపోయాడు. 4 నెలల తరువాత మరల వచ్చినప్పడు నేను ఇచ్చిన రెండు వేల రూపాయలను నేను చెప్పినట్లుగా ఖర్చుపెడుతున్నారా అని ఆఫీసులో అడిగాడు. మీరు చెప్పినట్లు ఖర్చు పెట్టటం లేదు, ఏది

అవసరం అయితే దానికి ఖర్చు పెడుతున్నాము అని చెప్పారు. అప్పుడు భగవాన్ దగ్గరకు వెళ్లి నేను ఇలా ఇచ్చాను, నా ఉద్దేశ్యం నెరవేరటం లేదు అని చెప్పాడు. అసలు నీవు రెండు వేల రూపాయలు ఇవ్వటం కంటే ఇవ్వకుండా ఉంటే బాగుండును అన్నారు. నీవు ఇచ్చేసి ఊరుకుంటే బాగుండును వారి అవసరానికి ఖర్చు పెట్టుకొంటారు. రెండు వేల రూపాయల బత్తాయిలు నేను ఎలా తినగలను. ఇటువంటి దానాలు ఎప్పుడు చేయకు. ఇటువంటి దానాల వలన నీ మనస్సు నశించదు, నీ మనస్సు పెరుగుతుంది అని చెప్పారు. నీవు చేసే దానం మనో నాశనానికి ఉపయోగపడాలి. నీకు సంబంధించినంత వరకు ఇలా కండిషన్ పెట్టేటట్లు అయితే దానం చేయటం మానేయి అని భగవాన్ చెప్పారు. ఇటువంటి గొడవలు జపయజ్ఞంలో ఉండవు. జపయజ్ఞం ఎంతకాలం చేయాలి అంటే మందులు ఎంత కాలం వాడాలి అని డాక్టరును అడిగితే రోగం తగ్గేవరకు వాడమని చెపుతాడు, అలాగే నీ హృదయంలో ఉన్న నిజం తాలుక ఎరుక నీకు కలిగేవరకు నీవు జపం విడిచిపెట్టవద్దు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 12-02-07, కావవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భౌతికంగా మనం చిన్న పని చేసినా భక్తిభావనతో, అంకితభావంతో చేయాలి. జీవితంలో క్రమశిక్షణ ముఖ్యం. ద్వేషం, ఇష్టం పెట్టుకొంటే క్రమశిక్షణ రాదు. మనిషి అయిన తరువాత ఎప్పడైనా ద్వేషం రావచ్చు దానిని దులుపేసుకోవాలి, లేకపోతే అది మనలను పీడించేస్తుంది. ఎవరిని చూసి ద్వేషపడినా, అసూయపడినా మనకు వచ్చేది నష్టమేకాని లాభం ఏమీ లేదు. నీవు ద్వేషం పెట్టుకొని ఉద్రేకంతో ఒకవేళ మంచిపని చేసినా అది కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. మనం మంచి పని చేయటమే కాదు సహృదయంతో చేస్తే అది సమాజానికి ఉపయోగపడుతుంది. అనుకూలపరిస్థితులు వచ్చినప్పడు పొంగిపోతూ, ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పడు కృంగిపోతూ ఉంటే నీవు మనస్సు యొక్క పరిధినిదాటి వెళ్లలేవు. అందుచేత ఎప్పటికప్పడు మనస్సును బేలెన్స్ చేసుకొంటూ ఉండాలి. మీ ఇంట్లో పదిమంది ఉన్నారు అనుకో వారు పదిరకాలుగా ఉంటారు, నీవు వారిని ఫాలో అవ్వవద్దు. ఎవరో అహంకారంతో చెప్పిన మాటలు, ఇష్టం లేక చెప్పిన మాటలు భుజాన వేసుకొని తిరగవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు. ఈశ్వరుని దయ లేకుండా మనం దేనిని పొందలేము. అయితే మనం నేర్చుకొన్న విద్యను మనం సంపాదించిన డబ్బును, భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సమాజానికి ఉపయోగిస్తూ ఉంటే మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. మీరు ఏమనుకొంటున్నారు అంటే జపం చేస్తే సరిపోతుంది, ధ్యానం చేస్తే సరిపోతుంది అనుకొంటున్నారు. అలా సరిపోదు. మనం

సంపాదించిన దానిని సమాజానికి ఉపయోగించలేకపోతూఉంటే ఎక్కడో మనస్సులో లోపం ఉంది అని అర్థం, ఆ లోపాన్ని సరిచేసుకోవాలి. మనస్సులో ఉన్న లోపాన్ని సరిచూసుకొంటే ప్రాక్టికాలిటీ వస్తుంది.

మనం ఏదైనా పని ప్రేమతో ఎక్కువ కాలం చేయగలము కాని ద్వేషంతో చేయలేము. మన బిహేవియర్ ఇంపెర్సనల్‌గా ఉండాలి. వ్యక్తి భావన పెట్టుకొంటే అభయస్థితిని పొందలేము. మాటలో, చేతలో, ఆలోచనలో మేగ్జిమమ్ వ్యక్తిభావనను తగ్గించుకొంటూ రావాలి. చేసేపని బాగుందా లేదా అనేది ముఖ్యం కాని ఆ పని చేసేవాడు తెరమీద కనబడనక్కరలేదు. పాత్రధారులు వేరు, సూత్రధారులు వేరు. సినిమాలో మనకు యాక్టర్స్ కనబడతారు, ఆ యాక్టర్స్ బాగా చేయటానికి డైరెక్టర్ కారణం, ఆయన మనకు కనబడడు. పాత్రధారి మనకు కనిపిస్తాడు కాని సూత్రధారి మనకు కనబడడు. మన ద్వారా ఏవైనా మంచి పనులు జరుగుతూ ఉంటే అవి మనం చేసినట్లు కాదు, అంతా భగవంతుడిదే, మనం వూరికే తెరమీద బొమ్మలం మాత్రమే, ఆడించేవాడు భగవంతుడే. మనం సూత్రధారులం కాదు, పాత్రధారులం మాత్రమే. మనం భగవద్గీతను రోజూ అధ్యయనం చేయాలి. అలా అధ్యయనం చేస్తూ ఉంటే కొంతకాలానికి మీకు అర్థమవుతుంది. మనకు బాగా ఆకలిగా ఉంది అనుకోండి, ఎంతోకొంత తినకుండా ఉండలేము. జీర్ణమైన అన్నం మన శరీరాన్ని ఎలా సుఖపెడుతుందో, ఎలా శక్తిని ఇస్తుందో అలాగ భగవద్గీత మనకు అర్థమవుతూ ఉంటే మనకు సుఖము, శాంతి కలగటమే కాదు దానిని ఆచరించకుండా మీరు ఉండలేరు. మీరు ఆచరించాలని ఆచరించరు. ఆచరించకుండా ఉండలేరు కాబట్టి ఆచరిస్తారు. ముందు మనం స్లోగా అధ్యయనం చేయాలి తరువాత అర్థం చేసుకోవాలి. అప్పుడు దానిని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది, ఎప్పుడైతే ఆచరించాలనే బుద్ధి కలిగిందో, ఎప్పుడైతే పరమాత్మ చెప్పినట్లుగా జీవిస్తున్నారో ఈ జీవుడికి, ఈశ్వరుడికి ఉన్న బేధం రాలిపోతుంది, అభేదస్థితి, అభయస్థితిని పొందుతారు. లోకానికి సంబంధించిన ఏ సంతోషాలు మనం జుర్రుకొన్నా భవిష్యత్‌లో అది దుఃఖంగా మారుతుంది. బాహ్యంగా మీకు ఏదైనా లాభం వచ్చింది అనుకోండి తాత్కాలికంగా సంతోషం వచ్చినా ఇది అంతా దుఃఖంగా మారిపోతుంది. స్వార్థం ఉన్నవాడికంటే స్వార్థం లేనివాడు ఈ సృష్టిలో ఎక్కువ లాభం పొందుతాడు. స్వార్థాన్ని విడిచిపెట్టి చూస్తే అది మీకు తెలుస్తుంది. స్వార్థం ఉన్నవాడికి ఇది తెలియదు అందుచేత వాడు స్వార్థాన్ని విడిచిపెట్టలేడు. ఈ సృష్టికి కంట్రోలర్ ఒకడు ఉన్నాడు, వాడే యజమాని, వాడే ఈశ్వరుడు, వాడే సూత్రధారుడు మనం పాత్రధారులం. ఆడించేవాడు ఏ మనిషిని ఎక్కడ ఉంచాలో, ఎలా ఉపయోగించు కోవాలో అన్నీ వాడే చూసుకొంటాడు. ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ

జరగటానికి వీలు లేదు, జరగదు. ఈ సృష్టికి యజమానులం మనం కాదు, మనం మధ్యలో వచ్చాము, మధ్యలో వెళ్ళి పోతాము, ఈ సృష్టి ఎప్పుడూ ఉంటుంది. మన పాత్రను మనం జాగ్రత్తగా పోషించుకొని వెళ్ళిపోతే సరిపోతుంది.

బట్టల మీద దుమ్ము దులుపుకొన్నట్లు ద్వేషం వచ్చినప్పుడు దులుపుకొంటూ ఉండాలి. అలా దులుపుకోకపోతే పోష్టుకార్డు మీద ముద్రలు వేసినట్లు, మన మనస్సు మీద ముద్రలు పడిపోతాయి. ఆ ముద్రలను చెరుపుకొని బయటకు రావటం చాలా కష్టం. రోగం దీర్ఘం అయ్యే కొలది అందులో నుండి బయటకు రావటం చాలాకష్టం అవుతుంది. సంతోషం, దుఃఖం ఇవి అన్నీ నీ మనస్సు కల్పించిన గొడవలు. మనస్సు కల్పించిన విషయాలు అన్నింటిని విడిచిపెట్టుకొంటూ రావాలి. మన శరీరానికి అనారోగ్యం వస్తే ఎలా బాగుచేసుకొంటామో అలాగ మనస్సును బాగుచేసుకోవాలి. మనస్సు సరిగా లేకపోతే, మనస్సు కంట్రోల్‌లో లేకపోతే మనం పాడైపోతాము. నీవు వేరు, నేను వేరు, వాడు ధనవంతుడు, వీడు పేదవాడు, వాడు ఎక్కువ, వీడు తక్కువ ఈ పెంట అంతా మనస్సులో ఉంది. మనస్సు అణగితే ఏమీ లేదు. నీ మనస్సును నిగ్రహించుకోకపోతే నీవు వెయ్యి కోట్లు సంపాదించుకొన్నా ప్రయోజనం సున్నా. చనిపోయిన తరువాత నీ మనస్సు నీ కూడా వస్తుంది. కాని వెయ్యి కోట్లు నీ కూడా రావు. చనిపోయిన తరువాత మన కూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవ టానికి మనం ఏమీ ప్రయత్నం చేయటం లేదు. దానికి కారణం మనకు శ్రవణం లేదు, మననం లేదు, జిజ్ఞాస లేదు, లోకంలో సర్వసాధారణంగా డబ్బు ఉన్నవారిని, అధికారం ఉన్నవారిని అందరూ పొగుడుతూ ఉంటారు, వారి అవసరం ఎప్పడైనా వస్తుందని వారిని విమర్శించరు, వారిచుట్టూ తిరుగుతారు. దానివలన ఏమీ రాదు, పైగా మీ మనస్సు పొల్యూట్ అయిపోతుంది. వారితో మాట్లాడకూడదు అని కాదు మనం మనంగా ఉండాలి అవసరం అయితే మాట్లాడ వచ్చు. మనస్సును ఎక్కువగా బాహ్యముఖానికి వెళ్ళనివ్వకూడదు. మనస్సును ఎక్కువకాలం హృదయంలో ఉంచగలిగితే అది నశిస్తుంది, దానికి సత్వగుణం అవసరం. మనం బంగారం కొనాలంటే డబ్బు అవసరం అలాగే మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచాలంటే సత్వగుణం ఉండాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేస్తే ఇంట్లో పేచీలు తగ్గుతాయి, సమాజంలో గొడవలు తగ్గుతాయి. మనకు స్నేహితులు, విరోధులు కనబడతారు కాని సత్వగుణం ఉన్నవాడికి స్నేహితులు, విరోధులు కనబడరు. ఎవడైనా ఉపకారం చేస్తే దేవుడు వాడిచేత చేయించాడు, ఎవడైనా అపకారం చేస్తే దేవుడు వాడిచేత చేయించాడు అని అనుకొంటాడు, వ్యక్తిగతంగా ఏమీ వాడు ఉద్రేకపడడు, వాడి చైతన్య స్థాయిని పోషించుకొంటూ ఉంటాడు.

మనం బాగుపడాలంటే ఒకటి ఆలోచన, రెండు సబ్జక్టు అంతేగాని ఏమీ డీవియేషన్

ఉండకూడదు. నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి, అందులో డీపెన్ అవ్వాలి. కొంతమంది వారికి సబ్జక్టు తెలియకపోయినా, తెలుసున్నట్లుగా నటిస్తారు, అది చాలా ప్రమాదం. ఏ విషయం అయినా మనకు ఎంతవరకు తెలుసు, ఎంతవరకు తెలియదు ఆ నిర్ధారణ ముఖ్యం. నీవు మంచి మనస్సుతో మాట్లాడు, చిన్న పని అయినా మంచి మనస్సుతో చెయ్యి, దీనికి ఏమీ పెట్టుబడి లేదు. నీవు ఆలోచించు ఇతరులను ఆలోచనాపరులను చేయి. నీవు ఉద్రేకపడకు, ఇతరులు ఉద్రేకపడేటట్లు చేయకు. మీరు ఇంజనీర్లు, డాక్టర్లు చదువుతున్నారు, నీ చదువును ఎంతోకొంత సమాజానికి ఎందుకు ఉపయోగించవు, సమాజానికి ఉపయోగిస్తేనే నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి సహకారం అందుతుంది. శాస్త్రప్రకారం మనం జీవించటం నేర్చుకోవాలి. మన డ్యూటీ మనం శ్రద్ధగా చేయాలి. ఇప్పుడు ప్రపంచ పరిస్థితి ఎలాగ ఉంది అంటే మన డ్యూటీ మనం చేయటానికి సన్మానాల కోసం ఎదురు చూస్తున్నాము. ఇంట్లో వంట వండటం మన డ్యూటీ. నేను రోజు వంట వండుతున్నాను, నన్ను ఎవరూ పొగడటం లేదు అంటే దానికి అర్థం ఏమిటి? మన పని మనం చేసుకోవటానికి సన్మానాలు చేయాలా, ఇలా అలవాటు పడిపోయి మనకు పాడుబుద్ధి వచ్చేస్తోంది. మనం ప్రశాంతంగా, నిర్మలంగా మన డ్యూటీ మనం చేసుకోవాలి. అలా చేస్తూ ఉంటే మనస్సుకు లోచూపు కలుగుతుంది, అది హృదయంలో ఐక్యమవుతుంది, ఆత్మాకారం చెందుతుంది.

మనందరం పాడైపోవటానికి కారణం కుటుంబపరంగా, సమాజపరంగా గుర్తింపులు కోరుకొంటాము. మనలను ఎవరూ గుర్తించకుండా ఉంటే మంచిది, గుర్తింపు వలన చాలా చెడ్డ ఉంది. మనకు ఏది మంచిది కాదో దానిని మనం కోరుకొంటున్నాము. జీవలక్షణాలను తగ్గించుకోవటానికే పూజ, జపం, ధ్యానం, విచారణ. జీవలక్షణాలు నశిస్తేనే ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు ఎరుకలోనికి వస్తుంది. ఈ లోకంతోగాని, పరలోకంతోగాని, జన్మలతోగాని, పుణ్యపాపాలతోగాని, రాగద్వేషాలతోగాని సంబంధం లేకుండా నీ హృదయంలో ఒక వస్తువు ఉంది. అదే సత్యం, అదే ఆనందం, అదే ఉండటం. దాని తాలుక ఎరుక నీకు కలుగజేయటమే గురువు చేసే ముఖ్యమైన పని. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. మనస్సుకు బలం లేకపోవటం వలన ఏదో ఒక ఆకర్షణలో పడిపోతూ ఉంటుంది. ఏక వస్తువును చింతించటం వలన, సత్పురుషుల సహవాసం వలన, మహాత్ముల మాటలను శ్రవణం చేయటం, మననం చేయటం వలన, జపధ్యానముల వలన, విచారణ వలన మనస్సుకు బలం వస్తుంది. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా రోజూ నేను ఎవడను అనే పుస్తకం చదవండి. అది ఎండిపోయిన తాటిరొట్టిలాగ ఉంటుంది. అందులో చెట్నీ, సాంబారు,

నెయ్యి ఏమీ ఉండవు. నేను ఎవడను అనే పుస్తకం చదువుతూ ఉంటే తాటిరొట్టి తిన్నట్లుగా ఉంటుంది, అయినా కొంత హితవు చేసుకొని చదవండి. మీరు భగవద్గీత చదువుతూ ఉంటే ఆ వాక్యం మీకు ఇష్టం లేనప్పడు అది అబద్ధం అని మీకు అనిపిస్తుంది, మీలో ఉన్న అజ్ఞానం వలన అలా మీకు అనిపిస్తుంది. దాని తాలుక మొట్టికాయలు తిన్నప్పడు కృష్ణుడు ఎంత యదార్థం చెప్పాడో అప్పడు మీకు తెలుస్తుంది. మీరు ఎవరికోసం అయితే జీవిస్తున్నారో, ఎవరికోసం అయితే సంపాదిస్తున్నారో వారే మొట్టికాయలు మొడతారు. గీతలో మాటలు మీకు అర్థమవ్వటంకోసం మీచేత మొట్టికాయలు తినిపిస్తాడు. ఈ జీవుడిని దేవుడుగా చేయటానికే మొట్టికాయలు మొడతాడు. జీవితంలో నీకు ఎటువంటి సంఘటనలు జరిగినా మిమ్మల్ని మరింత పవిత్రులుగా చేయటానికే, అది ఈశ్వరుని ప్రణాళిక.

నీమాటల ద్వారాగాని, పనుల ద్వారాగాని దొంగ నేనును పెంచుకోవద్దు. దొంగ నేనును పెంచుకొంటే నీ హృదయంలో ఉన్న నిజమైన నేను నీకు తెలియదు. హృదయం యొక్క లోతులు పెంచుకోవాలి. లోతులేని మనుషులకు జ్ఞానం రాదు. కొంతమంది ఎలా ఉంటారు అంటే మనం గెడ్డపారకోసం వారి ఇంటికి వెళితే ఇస్తానని చెప్పరు, ఇవ్వనని చెప్పరు, అప్పడేమి జరిగింది అంటే అని మొదలుపెట్టి ఏదో చెపుతూ ఉంటారు, చివరకు మనకు విసుగు వచ్చి బయటకు వచ్చేయాలి. ఇవి అన్నీ కుయుక్తులు, కుతంత్రాలు. ఇటువంటి మనుషులను రంపం పెట్టి కోసేసినా జ్ఞానం రాదు. ఔనంటే ఔను అనిచెప్ప, కాదంటే కాదని చెప్ప తప్ప లేదు. ఈ రెండింటిని కాదని ఏదో తలక్రిందులుగా మాట్లాడితే అక్కడ మాయ ఉన్నట్లు గుర్తు. కపటం ఉన్నవాడికి ఎవడికి జ్ఞానం రాదు. ఈ దేహం చనిపోతే తల్లి ఎవరో, తండ్రి ఎవరో, మిత్రుడు ఎవరో, శత్రువు ఎవరో ఇవి అన్నీ దేహానికి సంబంధించిన గొడవలు. కాని గురువుతో ఉన్న అనుబంధం జన్మాంతర అనుబంధం. ఏదైతే నీచేత పొందింపచేయాలో, నీ జీవితాన్ని ఎక్కడ మలుపు తిప్పాలో, నీలో ఉన్న బలహీనతలను ఎప్పడు బయట లాగి ఎలా కాల్చి బూడిద చేయాలో ఇది అంతా గురువు చూసుకొంటాడు. గురువు అనే వేటగాడు నీ అహంభావన అనే జంతువును చంపటానికి ప్రతి జన్మలోనూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వాడి పని పూర్తి అయ్యేవరకు నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు, లోపల ఉన్న చీకటిని పోగొట్టేవాడు గురువు. నీలో ఉన్న అజ్ఞానం అనే చీకటిని పోగొట్టే బాధ్యత తన మీద వేసుకొన్నాడు, నీవు గుర్తించినా గుర్తించకపోయినా, ఈ జన్మలో కాదు రాబోయే జన్మలో అయినా తన పని పూర్తి అయ్యే వరకు నిన్ను వెంటాడతాడు. గురువు యొక్క అనుగ్రహం నీ ఇంద్రియాలకు అందదు, నీ మనస్సుకు అందదు అందుచేత లేదని అనుకొంటావు. నీవు లేదని అనుకున్నప్పడు కూడా ఆయన ఏమీ అనుకోడు, ఆయన పని

ఏదో ఆయన చేసుకొంటూపోతాడు. ఒక మనిషి అహంకారం లేకుండా పనిచేస్తే వాడు చేసిన చేయనివాడితో సమానము. మనస్సు హృదయంలో ఉంచాలనుకొంటున్నాను కాని ఉంచలేకపోతున్నాను అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. దానికి కారణం ఏదో సంస్కారం, ఏదో వాసన, ఏదో అలవాటు నీ మనస్సును బయటికి లాగేస్తుంది. అలవాట్ల యొక్క వేగం ఒక్కసారిగా తగ్గదు. నీవు అభ్యాసం చేస్తూ ఉంటే అభ్యాసం వలన, వైరాగ్యం వలన నీ మనస్సు హృదయంలో నిలబడుతుంది. నీకు ఏ బలహీనత అయితే ఉందో ఆ బలహీనత లేనివారితో సహవాసం చేయటం వలన అది నీకు ప్లస్‌పాయింట్ అవుతుంది. మీకు చదువు బాగా రావాలనుకొన్నప్పడు మీకంటే బాగా చదువుకొన్నవారితో, మీకంటే బుద్ధిమంతులతో స్నేహం చేస్తూ ఉంటే అది అంతా మీకు వచ్చేస్తుంది. వైరాగ్యం ఉంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనకు ఎక్కడా ఇష్టం, అయిష్టం లేకపోతే మనస్సుకు చాపల్యం లేదు. గురువు పనిచేస్తాడు కాని సైలెంట్‌గా చేస్తాడు. గురువు ద్వారా నీకు వచ్చే ఉపకారం నీకు తెలియాలని ఆయన అనుకోడు, అలా అనుకొంటే వాడు గురువు కాదు.

భగవంతుడియందు నీ మనస్సు నిలబడకుండా బాహ్యానికి వచ్చేస్తూ ఉంటే ఏ కారణం వలన వస్తోందో చూసుకో. ఏ కారణం వలన మనస్సుకు చాపల్యం వస్తోందో ఆ కారణంపోతే నీకు చాపల్యం తగ్గిపోతుంది. నీ మనస్సు అటు, ఇటు చలిస్తోంది అనుకో, ఎందుకు చలిస్తోంది అంటే అక్కడ ఇష్టం అయినా ఉండాలి, అయిష్టం అయినా ఉండాలి. ఇష్టం ఉన్న చోట కోరిక ఉంటుంది, అయిష్టం ఉన్న చోట కోపం ఉంటుంది. ఇది కోరిక, ఇది కోపం అని మీకు తెలియదు. నీ శరీరం చనిపోకముందే కోరిక యొక్క వేగాన్ని, కోపం యొక్క వేగాన్ని నిగ్రహించుకో, అప్పడు నీవు బ్రాహ్మీస్థితిని పొందుతావు. కోరిక, కోపం ఇవి రెండూ కల్మషాన్ని తీసుకొని వస్తాయి, ఈ రెండూ మైనస్ చేస్తే కల్మషం లేదు. లోపల కల్మషం లేని స్థితి వస్తేనే కదా నీకు శాంతి స్థానం దొరికేది. సాధనాస్థితిలో ఉన్నప్పడు మీ మనస్సు బయటకు వెళుతోందా, హృదయం వైపుకు వెళుతోందా అని చూసుకొంటూ ఉండాలి. దేహాభిమానం ఉంటే లోపల, బయట అది లేకపోతే బయట లేదు లోపల లేదు. మనకు దేహాభిమానం ఉంది కాబట్టి మనస్సు హృదయం వైపుకు వెళ్ళేటట్లు ప్రయత్నం చేసుకోవాలి. మనస్సును ఉపసంహరించండి. మీరు మనస్సును ఉపసంహరిస్తూ ఉంటే ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా మరల మనస్సు బయటకు వచ్చేస్తుంది. నీకు ఉద్రేకం ఉంది అని తెలియజెప్పటానికే భగవంతుడు వాడిచేత విమర్శింపచేస్తాడు. ఉదయం ఎ.సి. గదిలో కూర్చొని కాఫీ త్రాగి, పరిస్థితులు అన్నీమనకు అనుకూలంగా ఉన్నప్పడు జ్ఞానం వచ్చేసింది అని మనకు అనిపిస్తుంది, అదొక రకమైన మాయ. నీకు రాలేదు అని తెలియటానికే భగవంతుడు కొన్ని

సంఘటనలు క్రియేట్ చేస్తాడు. గురువు యొక్క దయ లేకుండా ఒక్క అలవాటులోనుండి కూడా నీవు బయటకు రాలేవు. ప్రపంచం అద్దంలాంటిది. నీలోని బలహీనతలను ప్రపంచం చూపిస్తుంది. వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యి. ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో అక్కడ ఎక్కువ సేపు ఉండగలిగితే నీ మనస్సులో ఉన్న దోషాలు, పునర్జన్మ కారణాలు ఒక్కోటి బయటకు పోతాయి. శరీరంలో ఉన్న రోగకారణాలు అన్నీ పోయిన తరువాత శరీరానికి ఆరోగ్యం ఎలా వస్తుందో, అలాగే మనస్సులో ఉన్న అశాంతి, దుఃఖ కారణాలు అన్నీ బయటకు పోతే మనస్సు పవిత్రం అవుతుంది, మనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలం అవుతుంది. నిశ్చలమైన మనస్సు, నిర్మలమైన మనస్సు ఆత్మాకారం చెందుతుంది.

ఈ లోకంలో గొప్పలు సాధించాలి అని అనుకొంటే మనస్సు లోపలకు వెళ్లదు. నీవు బాగుపడాలి అనుకొన్నప్పుడు అన్నం తినేటప్పుడు తాలింపు ముక్కలను ఎలా తీసి ప్రక్కన పెడతామో అలాగ ఈ ప్రపంచాన్ని తీసి ప్రక్కన పెట్టు. లోకానికి దగ్గరగా ఉన్నవాడు భగవంతుడికి దూరమవుతాడు. ఇప్పుడు నేను పుస్తకాన్ని పట్టుకొన్నాను. దీనిని వదిలేస్తే కిందపడమని పుస్తకానికి చెప్పనక్కరలేదు, అదే కింద పడిపోతుంది. అలాగే నీ మనస్సు ఎప్పుడైతే నిర్మలం అయిందో, నిశ్చలం అయిందో, పవిత్రం అయిందో అప్పుడు నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా గంతులు వేసుకొంటూ నీ హృదయంలో పడిపోతుంది. నీకు ఇబ్బంది కలిగించే ఆలోచనలు, మీకు అశాంతిని తీసుకొని వచ్చే అలవాట్లు ఏమైనా ఉంటే వీటిలోనుండి బయటకు రాలేము ఏమో అని కంగారు పడవద్దు. మీరు సాధన చేయగా చేయగా, సత్కర్మ చేయగా చేయగా, భగవంతుడిని స్మరించగా స్మరించగా క్రమేపి అలవాట్ల యొక్క వేగం తగ్గిపోతుంది, గురువు అనుగ్రహం వలన వాటంతట అవే రాలిపోతాయి. పూర్వజన్మలో సాధన చేసి ఉంటే హృదయంలో ఏదో ఉంది, ఏదో ఉంది అది మనకు అనుభవంలోనికి రావటం లేదు అని కొంచెం, కొంచెంగా తెలుస్తూ ఉంటుంది. నీలో ఉన్న వ్యక్తిభావన, బలహీనతలు పూర్తిగా కాలి బూడిద అయితేగాని హృదయంలో ఉన్న వస్తువు నీకు స్పష్టంగా గోచరం కాదు. మీ లోపల ఉన్న బలహీనతలు మీకు తెలియవు. మేము బుద్ధిమంతులం, జ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నాము అని మీకు అనిపిస్తుంది. గురువు ఏమి చేస్తాడు అంటే మీలో ఉన్న వాసనలను కెలికి మీ బుర్రలోనికి తీసుకొని వచ్చి ఆ వాసనలు ఎంత లోతుగా ఉన్నాయో, ఎంత బలంగా ఉన్నాయో మీకు చూపిస్తాడు. ఆ వాసనను తొలగించుకునే శక్తిని నీకు ఇచ్చి, వాటిని తొలగించుకోవాలనే బుద్ధిని నీకు కలుగజేసి, ఆ వాసనను బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు, నిన్ను జ్ఞానంతో అలంకరిస్తాడు, వాడు గురువు. ఆయన నిర్మాణాత్మకంగా పని చేస్తాడు. రమణస్వామి అరుణాచలం ఆయన

అంతట ఆయన రాలేదు. నీవు యోగిలాగ కనిపిస్తున్నావు, నీబోటివాడికి ఇంటి దగ్గర పని ఏముంది, ఎక్కడికైనా పోరాదా అని అన్నగారు అంటాడు. ఎక్కడికి పోవాలి అప్పుడు లోపల నుండి అరుణాచలం అని స్ఫురణ వచ్చింది. మహాప్రవాహంలో గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకొని వస్తుందో అంత వేగంగా అరుణాచలం వచ్చి పడ్డాడు. ఉదయం సూర్యుడు నెమ్మది నెమ్మదిగా పైకి వస్తూ ఉంటే చీకటి తగ్గిపోతూ ఉంటుంది. అలాగే మీ లోపల చైతన్యస్థాయి పెరిగేకొలది మీలో ఉన్న అజ్ఞానం, దేహబుద్ధి తరిగిపోతూ ఉంటుంది. దేహప్రారబ్ధమును బట్టి ఏమైనా రావచ్చు కాని వాటిని నిగ్రహించుకోవాలి, బయట ఉన్న వస్తువులు ముఖ్యం కాదు, మనోనిగ్రహం ముఖ్యం. మన జీవిత విధానం ఎలా ఉండాలి అంటే ఈ ప్రపంచంలోనికి మనం వచ్చి వెళ్ళిపోయిన జాడ కూడా తెలియకూడదు, అంత సైలెంట్‌గా చేసుకొని వెళ్ళాలి. అనుకరణ వద్దు, అనుకరణ పిరికి వాని లక్షణం. నీవు పొరపాట్లు చేసినా నాకు ఇష్టమే కాని నీవు నీవులాగ ఉండు. నీవు నీవులాగ బతికితే దేవుడిని తెలుసుకోవటానికి దారి కనిపిస్తుంది అన్నాడు వివేకానంద. కృత్రిమంగా జీవించ వద్దు, దాని వలన బంధం పెరుగుతుంది.

పొయ్యిలో ఎండు కట్టెలు పెడితే తొందరగా అంటుకొంటాయి, తడిసిన కట్టె స్లోగా అంటుకొంటుంది. అలాగే మీలో కొంతమందికి వాసనలు తొందరగా పోతాయి, కొంతమందికి తొందరగాపోవు. వారికి ఎందుకు తొందరగా పోయాయి, నాకు ఎందుకు తొందరగా పోవటంలేదు అని అనుకోవద్దు. వారు పూర్వజన్మలో ఆ వాసనలు తొలగించుకోవటానికి ఎంత కృషి చేసారో మనకు కనబడదు. పూర్వజన్మలో చేసుకొని వచ్చారు కాబట్టి వారికి వాసన తొందరగా భస్మం అయిపోతుంది. మీరు ఇప్పుడే మొదలు పెట్టారు అందుచేత వాసన పోవటానికి కొంత టైము పట్టవచ్చు. వారికి తొందరగా పోయినాయి, నా అలవాట్లు తొందరగా పోవటం లేదు అని పోల్చుకొని అశాంతి తెచ్చుకోవద్దు. మీరు మీరుగా ఉండండి, మీ పద్ధతిలో మీరు సాధన చేసుకోండి. సాధన చేసే కొలది ఆ వాసన ఎంత లోతులలో ఉందో మీకు తెలుస్తుంది, ప్రయత్నం చేయనివాడికి ఏమీ తెలియదు. ప్రతీ స్వీట్‌లోను పంచదార ఎలా ఉంటుందో అలాగే జ్ఞాని మాట్లాడే ప్రతిమాటలోను కరుణ ఉంటుంది, ఆ మాట దేవుడై ఉన్నది. మీకు ఆలోచనే ప్రధానం. మీరు అలాగ ఉండాలని, ఇలాగ ఉండాలని అనుకోవద్దు. అదీ బంధమే, ఇదీ బంధమే. మీరు మీరుగా ఉండటానికి ప్రయత్నం చేయండి, మీ ఆలోచనలో, అలవాట్లలో పొరపాట్లు ఉంటే అవి పోవని భయపడవద్దు. మీరు సాధన ప్రారంభించండి. మీరు చేస్తున్న ప్రయత్నం గురువు అనుగ్రహంగా మారిపోతుంది. మీ వాసన మీకు బరువైన రాయిలాగ కనిపించవచ్చు కాని గురువుకు అది రాయి కాదు

నలుసుతో సమానము. ఎర్రచీమను తీసి బయటపడేసినట్లు నీలో ఉన్న వాసనలు అనే బండరాళ్లను కూడా బయటపడేస్తాడు, గురువు అనుగ్రహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. మీరు బాహ్యమైన గోడవలకు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో, మరణానంతరం మీ కూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటానికి అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వండి. మీరు లోకంలో ఎన్ని సాధించినా అన్నింటికంటే మీ మనస్సును నిగ్రహించు కోవటం చాలా ముఖ్యం. శరీరానికి రోగం వస్తే ఎలా బాగుచేసుకొంటున్నామో అలాగే మనస్సును బాగు చేసుకో. మనస్సు పవిత్రం అయ్యేకొలది, ఏకాగ్రం అయ్యేకొలది దానంతట అదే సహజంగా హృదయం అనే గూటిలో పడిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 18-03-07, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీరు ఏరంగంలో పనిచేస్తున్నప్పటికి, మీరు నాస్తికులైనా ఆస్తికులైనా మీ శరీరంలో ఉన్న ప్రాణం బయటకు పోయేవరకు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టకుండా ఉంటే మనం పవిత్రులం అవుతాము, బుద్ధి సూక్ష్మత వస్తుంది, ఆ రోజుకారోజు వైజర్‌గా, ప్యూరర్‌గా జీవించగలుగుతాము. మనం ఇతరుల క్షేమం కోసం పనిచేయటంలో మన క్షేమం కూడా ఉంది. మనం ఏ పని చేసినా అది త్యాగ భావనతో చేస్తే అది యజ్ఞంతో సమానము. మనలో ఉన్న మైనస్ పాయింట్ ఏమిటి అంటే మీ శరీరానికి ఈ జబ్బు ఉంది, ఈ మందులు వాడండి అని డాక్టరు చెపితే నమ్ముతాము, ఆ మందులు వాడతాము కాని భగవంతుడు మన ఇన్నర్‌లైఫ్ గురించి చెపితే, మనం ఆధ్యాత్మికంగా ఎలా అభివృద్ధిలోనికి వస్తాము, హృదయం యొక్క లోతులు ఎలా పెరుగుతాయి అని చెపితే భగవంతుడు చెప్పిన మాటలు మనం నమ్మము. డాక్టరు చెప్పిన మాటయందు ఉన్న విశ్వాసం కూడా భగవంతుడి యందు మనకు లేదు. దానికి కారణం మనకు పుణ్యబలం లేదు. డాక్టరుగారు చెప్పేది అది నేర్చుకొన్న విద్య. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి. ప్రతీ దేశానికి రాజ్యాంగం ఎలా ఉంటుందో అలాగే మనకు కనిపిస్తున్న ఈ సృష్టినంతను నడపటానికి కొన్ని సూత్రాలు ఉన్నాయి. ఆ సూత్రాలను బట్టి ఈ సృష్టిని నడిపే వాడు ఒకడు ఉన్నాడు, వాడే ఈశ్వరుడు. ఈ జీవకోటిని ఎలా నడపాలి, పంచభూతాలను ఎలా నడపాలి, కర్మఫలాన్ని ఎలా అనుసంధానం చేయాలి ఇదంతా చూసే ఒక కంట్రోలర్ ఉన్నాడు, వాడే భగవంతుడు, ఆయనే ఈ సృష్టికి అధ్యక్షుడు, ఆయనకు తెలియకుండా ఏదీ జరగదు. ఇక్కడ అనేక శరీరాలు ఉన్నాయి, ఈ శరీరాలను చూసి, వారి గుణాలను చూసి వీరందరూ భిన్న భిన్నంగా ఉన్నారని మనం అనుకొంటున్నాము కాని లోపల మనందరిలో

ఉండి, మనలను నడిపే వస్తువు భిన్న భిన్నంగా లేదు, అది ఏకంగా ఉంది. లోపల పరమాత్మ లేకుండా ఏ శరీరం కూడా ఈ సృష్టిలోనికి రాదు. మన ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి అందని శక్తి ఒకటి ఉంది. అది మన లోపల ఉంది, బయట ఉంది, ఈ సృష్టి అంతా వ్యాపించి ఉంది. సృష్టి అంతా ఏ వస్తువు అయితే వ్యాపించి ఉందో అది మన హృదయంలో కూడా ఉంది. మనకు దేహం నేను అనే తలంపు ఉంది. ఈ తలంపు వలన లోపల ఉన్నది వేరు, బయట ఉన్నది వేరు అనుకొంటున్నాము. జ్ఞానికి లోపల లేదు, బయట లేదు. జ్ఞానం అనేది రెండుగా ఉండదు, ఏకంగా ఉంటుంది. మనం స్వార్థం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. మనం కొద్దిగా స్వార్థం విడిచిపెట్టినా సమాజానికి ఎంతో ఉపయోగపడతాము. సేవ సేవ కోసమే చేయాలి. సేవ సేవ కోసం చేస్తే నీకు ఒక రకమైన సంతృప్తి కలుగుతుంది, అప్పడు నీకు లోచూపు కలుగుతుంది. మనస్సు బయటకు వస్తే అజ్ఞానం, అది లోపలకు వెళితే అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుడిని తెలుసుకోవటానికి ప్రిపేర్ అవుతుంది.

బాహ్యంగా ఏదైనా వృత్తి నేర్చుకోవాలంటే ఎలా శిక్షణ ఇస్తున్నామో అలాగే మనో నిగ్రహం కోసం మనస్సుకు శిక్షణ ఇవ్వాలి. ఆత్మజ్ఞానసముపార్జన కోసం మనం కాలాన్ని మేనేజ్ చేసుకోవాలి, మనస్సును మేనేజ్ చేసుకోవాలి, శరీరాన్ని మేనేజ్ చేసుకోవాలి. తరువాత మనం చేస్తున్న పనిని ఎంజాయ్ చేయాలి. మనం అన్నం తింటున్నాము. మనం తినే అన్నం మనకు శాంతిని ఇస్తోందా, అశాంతిని ఇస్తోందా అని చూసుకోవాలి. మనం ఇతరులకు చేసిన సహాయం అది భవిష్యత్ జన్మలకు పెట్టుబడి, అది మీకు తెలియక వారికి ఏదో సహాయం చేసేస్తున్నాము అనుకొంటున్నారు. దేహం మరణించినప్పడు దేహయాత్ర ముగిసిపోతుంది కాని జీవుడి యాత్ర ముగియదు, అది శరీరాలు మార్చుకొంటూ ఉంటుంది. జీవుడు ఎక్కడ నుండి అయితే పుట్టి వచ్చాడో ఆ మూలంలోనికి వెళ్ళివాడు లయం అయ్యేవరకు జీవుడియాత్ర ముగియదు. శరీరం ఆరోగ్యంగా ఉంది అనుకోండి, మనస్సు అశాంతిగా ఉంది అనుకోండి. శరీర ఆరోగ్యం మనస్సు యొక్క అశాంతిని పోగొట్టలేదు. కాని మనస్సు శాంతిగా ఉంది అనుకోండి, శరీరం అనారోగ్యంగా ఉంది అనుకోండి. మనస్సులో ఉన్న శాంతి శరీరంలో ఉన్న రోగం తగ్గటానికి సహకరిస్తుంది, 10 రోజులలో తగ్గే రోగం 5 రోజులలో తగ్గిపోతుంది. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా శాంత చిత్తమును కాపాడుకోవాలి. ఇతరులను చూసి మనం ద్వేషిస్తూ ఉంటే శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతాయి. అసలు భక్తి అంటూ ఉంటే మనలను ఎక్కడ మలుపు తిప్పాలో, ఎలా బాగుచేయాలో అంతా భగవంతుడే చూసుకొంటాడు.

మనం కుటుంబంలో డ్యూటీ బాగానే చేస్తాము కాని సమాజంలో మన డ్యూటీ

మనం చేయము. ఇది మనలో ఉన్న పొరపాటు. మన పని అయితే ఒక రకంగా చేస్తాము, ఇతరుల పని అయితే వేరొక రకంగా చేస్తాము. ఇది భగవంతుడు చూస్తాడు. ఇల్లు మనది అనుకొంటాము. రోడ్లు, బస్సులు, ట్రైనులు మనవి కాదు అనుకొంటాము. ఇంక మనకు భక్తి ఏమిటి? కుటుంబంలో మనం డ్యూటీ ఎలా చేస్తామో, సోషల్ డ్యూటీ కూడా అలాగ చేయాలి. మన కుటుంబ వ్యవస్థ ఇతరులకు సహాయం చేయనివ్వదు. పని పని కోసమే చేయాలి. సేవ సేవ కోసమే చేయాలి. అది గౌరవం కోసం చేస్తే దేవుని అనుగ్రహం నీకు రాదు, రాదు. మనం ఎవరికైనా ఉపకారం చేస్తే సుఖంగా, శాంతిగా చేయాలి. అశాంతిగా చేస్తే అది వారికి ఉపయోగపడదు. మనం చేసే పని చిన్నది అయినా ఆ పని చేసేటప్పుడు బుద్ధి శుద్ధిగా ఉండాలి. నీవు చేసే పని ఆనందంగా చేస్తే దాని వలన వారికి ఆనందం కలుగుతుంది కాని నీవు ఏడుస్తూ చేస్తే వారికి ఆనందం ఎలా కలుగుతుంది. దానం అంటే మనం చేసేది శాంతిగా చేయాలి, దానివలన నీకు శాంతి కలగాలి, ఇతరులకు శాంతి కలగాలి, అది నీకు సుఖం కలిగించాలి, బాధను కలిగించకూడదు. దాని వలన బాధ కలిగితే నీకు రజోగుణం పెరిగిపోతుంది. కోరికలోనుండే కోపం, లోభిత్వం, అసూయ సర్వఅరిష్టాలు వస్తున్నాయి. కోరిక లేకపోతే కోపం లేదు, అసూయ లేదు. కోపం, అసూయ, లోభిత్వం ఇవి అన్నీ నరకానికి వెళ్ళే ద్వారాలు అని భగవంతుడు చెప్పాడు. మనస్సును మేనేజ్ చేసుకొంటే భౌతికంగా కూడా నీకు లాభం కలుగుతుంది. ఎమోషన్ ఉన్నప్పుడు ఇతరులు మంచి మాటలు చెప్పినా అవి మనం గ్రహించలేము. భగవంతుడిని ప్రమాణంగా పెట్టుకో, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. రాగద్వేషములతో చెప్పిన మాటలు ప్రమాణంగా పెట్టుకోవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తే నీ మనస్సుకు అంతర్ముఖత్వం వస్తుంది. అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నేను కర్తను కాదు, భగవంతుడే కర్త అని నోటితో చెప్పటంకాదు, అది అనుభవం లోనికి వస్తే వాడు మాత్రమే నిజమైన సుఖాన్ని పొందుతాడు. అయితే మనం కర్త అనుకొంటున్నాము, భగవంతుడు అకర్త అనుకొంటున్నాము, అందుచేత మనలను దుఃఖం వెంటాడుతోంది.

భగవంతుడు చెప్పిన మాటలను మనం నమ్మము, నమ్మినట్లు నటిస్తాము. ఆ మాటలను నమ్మితే మనం ఎప్పుడో బాగుపడిపోదుము. పిచ్చివాడికి మనం మంచి మాటలు చెప్పినా వాడు వినడు. పిచ్చివాడు మన మాటలను ఎలాగ వినడో అలాగే మనం లోకపిచ్చిలో ఉన్నంతకాలం భగవంతుడు చెప్పినమాటలను మనం వినము. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. కారణం లేకుండా ఇతరులను బాధపెడతారు. ఎదుటివారి మనస్సుకు గాయం అయ్యేలాగ మాట్లాడతారు. వారిని నీవు ఎక్కడ ఆపుచెయ్యగలవు. వర్షం వస్తే

గొడుగు వేసుకొంటాము, రోడ్డు మీద ముళ్ళు ఉంటే చెప్పలు వేసుకొని వెళతాము అలాగే ఈ గొడవలు అన్నీ నీకు తగలకుండా ఉండాలంటే, నీ రోజులు సుఖంగా వెళ్ళిపోవాలంటే నీ మనస్సుకు చెప్పలు వేసుకో సరిపోతుంది, రోజులు హాయిగా గడిచిపోతాయి అంటున్నారు. భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మనం చేసే ప్రతీపని, సాధన, ప్రతీమాట తపస్సుతో సమానము, నేను అనే తలంపును ఒక ప్రక్కనపెట్టి, వ్యక్తిభావన లేకుండా నీవు పనిచేస్తూ ఉంటే అది తపస్సు అని భగవాన్ చెప్పారు. సోమరితనం, గర్వం ఇవి ఎందుకు పనికిరావు. కాని మనం ఈ రెండింటి చుట్టూ తిరుగుతున్నాము. ఇవి ఎందుకు పనికిరానివి అని ముందు నీకు అర్థమవ్వాలి, అర్థమైతే అందులోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తాము. కొంతమందికి తెలివితేటలు ఉంటాయి, సహనం ఉండదు. సహనం లేని తెలివితేటలు వాడికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు. మనం భగవంతుడికి భిన్నంగా లేము. కాని భగవంతుడికంటే భిన్నంగా మనం ఉన్నాము అని అనుకొంటున్నాము. అలా అనుకొనేవాడు ఎవడు? వాడు ఎవడో తెలిస్తే నీకు దేవుడు తెలుస్తాడు. బుడగలు, కెరటాలు, నురుగు అన్నీ ఎక్కడ ఉన్నాయి. అవి సముద్రంలోనే ఉన్నాయి. అవి సముద్రంలోనే పుట్టి సముద్రంలోనే కలిసిపోతున్నాయి. అవి సముద్రానికి భిన్నంగా లేవు. అలాగే నీవు భగవంతుడిలోనే అనేక జన్మలు ఎత్తుతున్నావు. నీవు ఎన్నిసార్లు పుడుతున్నా, ఎన్నిసార్లు చనిపోతున్నా అది భగవంతుడిలోనే జరుగుతోంది, ఆ విషయం నీకు అర్థం కావటం లేదు. ఎందుచేతనంటే మనకు బేదబుద్ధి అంటే ఇష్టం.

నేను అనే తలంపు నీకు ఉంది. ఈ నేను అనే తలంపు మనకు లోపల నుండే వస్తోంది. అది ఎక్కడనుండి వస్తోందో మనకు తెలియటం లేదు. ఈ తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. వైరాగ్యబలంతోటి, వివేకబలంతోటి, పుణ్యబలంతోటి, సత్సంగబలంతోటి ఈ మూలతలంపు మూలంలోనికి వెళ్ళగలిగితే దానికి ఆధారంగా ఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. నేను అందరి హృదయాలలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. దేహబుద్ధి ఉన్నవాడికి, కర్మఫల కాంక్ష ఉన్నవాడికి ఈ మాటలు అర్థం కాదు. అప్పడు ఉపాసన కోసం శంకరుడిని నేను, రాముడిని నేను, కృష్ణుడిని నేను అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడి యొక్క దయ లేకుండా మాయ మనకు దారి ఇవ్వదు. ఈ సృష్టి అంతా సక్రమంగా నడిచిపోతోంది. వేసవికాలం తరువాత వర్షాకాలం, వర్షాకాలం తరువాత సీతాకాలం అలా క్రమంగా జరిగిపోతున్నాయి. అందుచేత ఈ సృష్టి ఉంది, భగవంతుడు లేడు అనుకొంటున్నాము. కాని ఇది అంతా క్రమంగా నడిపించేవాడు ఆయనే అనెడు బుద్ధి మనకు పోయింది దానికి కారణం మనకు పుణ్యబలం లేదు. ఓ అరుణాచలేశ్వరుడా! కళ్ళులేకుండా నీవు చూడగలవు,

కళ్ళు లేకుండా ఈ సృష్టినంతా నీవు చూస్తున్నావు. కళ్ళు లేకుండా చూసే నిన్ను చూడగలిగినవాడు ఎవడైనా ఈ సృష్టిలో ఉన్నాడేమో చూడు, దాని అర్థం ఏమిటి అంటే నిన్ను తెలుసుకోగలిగినవాడు ఈ సృష్టిలో ఎవడైనా ఉన్నాడేమో చూడవయ్యా, ఇది అంతా కష్టం, కష్టం అని మీరు అనుకోవద్దు. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. మనకు జిజ్ఞాస కలిగింది అనుకోండి ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది అంటే మనకు ఇష్టంలేక ఇది అంతా కష్టం కింద మనకు అనిపిస్తోంది. సజ్జనసాంగత్యం వలన అన్నీ వస్తాయి, మోక్షం కూడా వచ్చేస్తుంది. భగవంతుడి నామం చేసుకోవటం ఎందుకు అంటే కాలక్షేపం కోసం కాదు, మనం పవిత్రులం అవ్వటానికి, బుద్ధిసూక్ష్మతను పెంచుకోవటానికే భగవంతుడి నామం జపించాలి. ప్రతీ మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటం కోసం పనిచేస్తూ ఏదో రోజు చనిపోతాడు. మనం శరీరాన్ని అలంకరించు కొంటే పరవాలేదు కాని అహంకారాన్ని అలంకరించుకొంటే ప్రమాదంలో పడతాము, శరీరం మరణించాక మనకు చీకటిలోకాలు మిగులుతాయి.

మన పాడుబుద్ధి భగవంతుడిని తెలుసుకోలేదు. శ్రవణం చేయగా చేయగా, భగవంతుడిని స్మరించగా స్మరించగా బుద్ధి శుద్ధి అవుతుంది. $104^0$ జ్వరం ఉన్నవాడికి పాయసం రుచి ఏమి తెలుస్తుంది అలాగే నూటికి నూరుపాళ్ళు లౌకికులకు భగవంతుడి యొక్క వైభవం ఏమి తెలుస్తుంది. భౌతికమైన పని కూడా మీరు సహృదయంతో, సద్బుద్ధితో చేస్తే ఆ భౌతికమైన పని కూడా ఆధ్యాత్మికం అయిపోతుంది. అయితే మన సంకల్పం మంచిదై ఉండాలి, బుద్ధి శుద్ధిగా ఉండాలి. ఈ సృష్టి అంతా నాదే అనుకొని పనిచేయటం కర్మమార్గం, ఈ సృష్టిలో ఏదీ నాది కాదు అని పనిచేయటం జ్ఞానమార్గం. అసలు నిజంగా ఏదీ మనది కాదు. గుడికి వెళ్ళి హారతి పళ్ళెంలో రూపాయి వేసి భగవంతుడికి ఇచ్చాము అనుకొంటాము. ఆ రూపాయి ఎవరిది, భగవంతుడిదే. ఆయనది ఆయనకే ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటావు. సృష్టిలో ఉన్న సంపద అంతా ఈశ్వరుడిదే. సంపద కూడా మన తెలివితేటలను బట్టి రాదు. ప్రారబ్ధంలో సంపద రావలసి ఉంటే మనకు కోరిక లేకపోయినా వచ్చేస్తుంది. ప్రారబ్ధంలో సంపద లేదు అనుకో నీవు కోరుకొన్నా సంపద నీకు రాదు. భగవంతుడి సంకల్పం కంటే ఎక్కువ రాదు, తక్కువ రాదు. కోరికకు శక్తి లేదు, శక్తి ఈశ్వరుడిది. సృష్టి అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది, ఇది అర్థమైతే నీవు సుఖపడతావు, అర్థంకాకపోతే ఆ జన్మకు ఆజన్మ అశాంతి, దుఃఖం నిన్ను వెంటాడతాయి. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఎప్పటికప్పుడు మనస్సును బేలెన్స్ చేసుకొనే వాడే నిజమైన అదృష్టవంతుడు. మీకు ఎప్పుడైనా భయం వేస్తూ ఉంటే దానికి మందు ధైర్యం. మీకు ఏ కారణం వలన భయం కలిగినా అప్పుడు ధైర్యంగా ఉండగలగటమే మందు. నీకు ఆత్మజ్ఞానం కలిగే వరకు

ఏదో వెలితి, ఏదో కొరత, ఏదో రకమైన భయం నిన్ను పీడిస్తూనే ఉంటాయి. ఆత్మజ్ఞానం ఎప్పుడైతే కలిగిందో అప్పుడు భయరహితస్థితిని పొందుతావు. కొంతమందికి చాలా డబ్బు ఉంది, ఇంట్లో చూసేవారు ఉండరు, అన్నానికి ఇబ్బంది పడేవారు ఉంటారు. ఆరోగ్యం బాగా ఉన్నంతకాలం డబ్బులు ఉంటే కాశీ, రామేశ్వరం అవి తిరగవచ్చు. ఇంక మంచాన పడ్డామా డబ్బు ఏమీ ఉపయోగ పడదు, అప్పుడు మనిషి అవసరం ఉంటుంది. అందుచేత మనుషులను ప్రేమించటం నేర్చుకోండి. లౌకికుడు డ్యూటీ కింద చేసేదే భక్తుడు పూజకింద చేస్తాడు. ధర్మాన్ని మనస్సులో పెట్టుకొని నువ్వు ఏదైనా పదిరూపాయలు సంపాదించుకో, పొట్ట పోషించుకో. కాని శాస్త్రంలో ఒక మాట చెప్పారు. నువ్వు ఇతరులను పీడించి, పీడించి డబ్బు సంపాదిస్తే అది ధనం కాదు, అది రక్తం అని పరమాత్మ చెప్పాడు.

మనం భగవంతుడిని ఎందుకు తెలుసుకోలేక పోతున్నాము అంటే భగవంతుడు అసత్యం అనుకొంటున్నాము, ప్రపంచం సత్యం అనుకొంటున్నాము అందుచేత భగవంతుడిని తెలుసుకోలేకపోతున్నాము. అసలు ఉన్నది భగవంతుడే, ప్రపంచం లేనే లేదు కాని మనం దీనికి భిన్నంగా అనుకొంటున్నాము. ప్రపంచం నిజం అనుకోవటం వలన ప్రపంచంలో జరిగే సన్మానాలు, గౌరవాలు నిజం అనుకొంటున్నాము. ప్రపంచం ఎంత అసత్యమో ఇవి కూడా అంతే అసత్యం. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఇది నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. మన దేహం చనిపోయేటప్పుడు పునర్జన్మ ఏమి ఇవ్వాలి అని భగవంతుడు చూస్తాడు. జీవితం పొడుగునా మనం ఏ విషయాలు అయితే ఎక్కువగా ఆలోచించామో అవే మరణ సమయంలో వస్తాయి. మీరు ఏ కులస్థులైనా, మీకు ధనం ఉన్నా లేకపోయినా, మీకు పాండిత్యం ఉన్నా లేకపోయినా ప్రాణం పోయే క్షణంలో బాహ్య పరిస్థితులలో సంబంధం లేకుండా మీరు నూటికి నూరు పాళు సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉంటే ఇంక వాడికి పునర్జన్మ లేదు. ఇంక నీవు నాలుగు రోజులలో చనిపోతావు అని డాక్టరుగారు చెపితే వాడు అన్నీ ఎలా సర్దుకొంటాడో అలాగ రేపు మన శరీరానికి మరణం వస్తుంది అనుకొని మనం శ్రద్ధగా సాధన చేసుకోవాలి, వైరాగ్యబలం పెంచుకోవాలి. ఆశ అంత ప్రమాదం కాదుకాని దురాశ చాలా ప్రమాదం. మీకు రోజులు బాగావెళ్ళిపోతున్నాయి అనుకోండి. భగవంతుడిని స్మరించటం మానేసి, భగవంతుడు చెప్పిన మాటలు శ్రవణం చేయటం మానేసి మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకొంటూ కూర్చొంటే మీకు కష్టకాలం ఎదురవ్వవచ్చు. రోజులు బాగా వెళుతున్నప్పుడే అన్ని కంఫర్టులు నీకు ఉన్నప్పుడే భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, ఆయనను ధ్యానిస్తూ ఉంటే మీకు దురదృష్టమైన రోజులు రావు, ఒకవేళ వచ్చినా అవి మిమ్మల్ని బంధించవు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 09-05-07, ఆత్రేయపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీరు అహంకారం ఉత్పత్తి అవ్వకుండా చూసుకొంటే, అహంకారం నాశనం అయితే సూర్యుడికంటే ఎక్కువ కాంతిని మీరు లోకానికి ఇవ్వగలరు. సూర్యుడు ఒక్కసారి పేలిపోతే ఎంత శక్తి వస్తుందో, మీరు అహంకారం పోగొట్టుకొంటే అంతకంటే ఎక్కువ శక్తి మీ ద్వారా సమాజానికి కలుగుతుంది. మన భక్తులు అందరూ కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా మీరు అభివృద్ధిలోనికి రావాలంటే కాలాన్ని పాడుచేసుకోకూడదు. నిన్నటిరోజు మరల రమ్మంటే రాదు. విషయచింతన వలన మనం పతనమైపోతున్నాము. దైవచింతన, ఆత్మచింతన వలన భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి వస్తాము. దైవచింతన, ఆత్మచింతన వలన మనోనాశనం అవుతుంది. ఎప్పుడైతే మనోనాశనం అయిందో నీ ద్వారా శాంతి, కాంతి సమాజంలోనికి వ్యాపిస్తుంది. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను పోతే మనం పోతాము అని మనకు భయం వేస్తుంది. ఆ నేనుపోతే మనం పోము మనం ఏదిగా ఉన్నామో అది మనకు ఎరుకలోనికి వస్తుంది, శాశ్వతమైన సుఖం మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. దాత అంటే అడగకుండా ఇచ్చేవాడు, ఆయన అవసరాన్ని బట్టి ఇస్తాడు, మనం అడగనక్కరలేదు, వాడు దాత. అడిగితేనేగాని చేయనివాడిని ధర్మపరుడు అంటారు. వాడూ మంచివాడే కాని ధర్మపరుడు దాత అవ్వడు. కొంతమంది అడిగినా, వారికి ఇవ్వగలిగే శక్తి ఉన్నా ఇవ్వరు, వాడు అధముడు. కొంతమంది వారు ఇవ్వనక్కరలేదు, ఎదుటివారు ఎవరైనా ఇస్తూ ఉంటే చెడగొడతారు, వారు అధమాధములు. అందుచేత అందరూ దాతలు కాదు. ఓ అరుణాచలేశ్వరుడా! నీకు దాత అనే పేరు ఉంది. ఎందుచేతనంటే నీవు ఎవరితోను అడిగించుకోకుండా వారి మనస్సులో ఏముందో చూసి, వారికి ఏమి కావాలో అడగకుండానే ఇస్తున్నావు. అటువంటి స్వభావం ఉన్న నీవు నా విషయంలో అడిగితేనే కాని ఇవ్వవు అనుకో నీ కీర్తికి, గౌరవానికి మచ్చ ఏర్పడుతుంది అంటున్నారు భగవాన్.

మనకు దుఃఖం పూర్తిగా నశించాలంటే, ఆనందం సుఖం శాంతి పొంగిరావాలంటే మనలో ఉన్న అహంభావన నశించాలి. దేహబుద్ధి నశిస్తేనేగాని శాశ్వతంగా దుఃఖం నశించదు, సుఖప్రాప్తి కలుగదు. ఇంక నాకు రామదర్శనం అవ్వదు, రావణాసురుడి దూతలు పెట్టే బాధలు భరించలేకపోతున్నాను, ఇంక మరణమే శరణ్యం అని అశోకవనంలో సీతమ్మ అనుకొంటుంది. చెట్టుకింద ఆవిడ పడే బాధ అంతా ఆంజనేయస్వామి చూస్తాడు.

ధనధాన్యాల కంటే, లోకంలో కనిపించే బంగారం కంటే, వజ్రాలకంటే ప్రాణం విలువైనది అని నెమ్మదిగా ఆంజనేయస్వామి అంటాడు. ఆయన రామదూత అని సీతమ్మకు తెలియదు. ప్రాణం చాలా విలువైనది. ప్రాణం పోతే నీవు రాముడిని ఎలా చింతిస్తావు, ప్రాణం ఉంటే కదా నీవు రాముడిని చింతించేది. నువ్వు రామచింతన వదిలేసి రాక్షసులు ఏవో బాధలు పెడుతున్నారు అనుకొంటున్నావు. నీవు రాముడిని చింతించుకో. ప్రాణం ఉంటే ఇవి అన్నీ చేయగలవు. నువ్వు బంగారానికి వెలకట్టగలవు, రత్నాలకు వెలకట్టగలవు కాని ప్రాణానికి వెలకట్టలేవు. నీవు రాముడిని చింతించటం మానేసి ఎవరో బాధలు పెడుతున్నారని అటువంటి ప్రాణాన్ని పోగొట్టుకోవాలి అనుకొంటున్నావు. ప్రాణం విలువ నీకు తెలియదా అమ్మా అంటాడు. మనకు ఏవైనా కష్టాలు, నష్టాలు, బాధలు రావచ్చు. వాటిని చూసి ప్రాణం పోగొట్టుకోవాలి అనుకోకూడదు. ఆ నెగిటివ్ థింకింగ్‌లోనికి మనం వెళ్ళకూడదు. జీవితంలో మనం బాగుపడాలంటే పాజిటివ్ థింకింగ్, పాజిటివ్ బిహేవియర్ ఉండాలి. కొంతమందికి పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగాని పోదు అంటే పుట్టుకతో వచ్చిన బుద్ధి వాడు చనిపోయాక ఆ శవాన్ని కాల్చేసినా ఆ బుద్ధి పోదు అని చెప్పటం. మనం ఎంతో సాధన చేస్తేనేగాని, ఈశ్వరానుగ్రహం ఉంటేనేగాని, రాముడి అనుగ్రహం ఉంటేనేగాని మన బుద్ధిలో మార్పురాదు, ఆ స్వభావంలో మార్పు రాదు. మన బుద్ధిలో మార్పు తెచ్చుకోకుండా, మన స్వభావం మారకుండా మనం వంద ఏళ్ళు బతికినా ఏమీ ప్రయోజనం లేదు. ఊరికే బియ్యం బస్తాలు ఖర్చు, భూమికి బరువు. మనకు ఏదో పొట్ట ఉంది కాబట్టి తినటం తప్పదు కాని మనకు జ్ఞానం రాదు. అంటే స్వభావంలో మార్పు రాకుండా నీకు జ్ఞానోదయం అవ్వదు అని చెప్పటం.

ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రతీ జీవుడికి అడ్డు వచ్చేవి మూడు దోషాలు. ఈ దోషాలు పోగొట్టుకొంటే మీ హృదయంలో ఉన్న నారాయణుడు మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీ హృదయంలో ఉన్నదే మీకు గోచరిస్తుంది కాని లేనిది రాదు. మూడు దోషాలు చెప్పాడు, ఏ మందులు వాడితే ఆ దోషాలు పోతాయో కూడా పరమాత్మ చెపుతున్నాడు. 1. మలదోషం అది బుద్ధిలో ఉంటుంది. ఇష్టం, అయిష్టం అనే సుడిగుండాలలో మనిషి కొట్టుకొనిపోతూ ఉంటాడు. ఇష్టా అయిష్టాలనే రాగద్వేషములు అంటారు. ఇష్టం ఉన్నా మనస్సు బయటకు వచ్చేస్తుంది, అయిష్టం ఉన్నా మనస్సు బయటకు వచ్చేస్తుంది. మనం ఇటు చూస్తే అవి పోగొట్టుకోలేము. విశాలమైన ఈ సృష్టిలో మన జీవితాలు ఏ పాటివి అని అటునుంచి ఆలోచిస్తే ఈ రెండూ పోతాయి. నీకు మలదోషం ఉన్నంతసేపు రాగద్వేషాలు పోవు. నీ పని ఏదో నీవు శ్రద్ధగా చేసుకొంటూ, సమాజానికి సంబంధించినంత వరకు నీకు ఋణం ఏదైనా ఉంటే తీర్చుకొంటే మలదోషం పోతుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారి సంతానం పేకాట నేర్చుకొని,

గుర్రపు పందాలు నేర్చుకొని మొత్తం ఆస్తి అంతా తగలేసినా వూరుకొంటారు కాని వారి చేతితో చిన్న పని కూడా సమాజానికి చేయరు, సమాజానికి ఏమీ ఉపయోగపడరు, వారు పూజలు చేసినా కూడా మలదోషం పోదు. నువ్వు మంచిపని చేస్తే సరిపోదు, చేసేటప్పుడు మంచిబుద్ధితో చెయ్యి అని భగవాన్ పదే పదే చెపుతూ ఉండేవారు. ఒకసారి కంచి పరమాచార్యతోటి ఎవరో చెపుతున్నారు. నేను ఏదో నాకు చేతనైనంతవరకు కళ్ళు కనబడనివారికి, వైద్యం చేయించుకోలేని వారికి కంటి వైద్యం చేయిస్తున్నాను అని చెపుతున్నాడు. ఈ ప్రాణం వచ్చింది అందుకే కదా అన్నారు పరమాచార్య. ఈ శరీరంలో ప్రాణం పోసాడు, నీవు ఏవో కొన్ని మంచి పనులు చేయవు అనుకో, ఇంక ఈ శరీరాన్ని, ప్రాణాన్ని ఏమి చేసుకొంటావు. బొంగరాలు ఆడతావా? పేకాట ఆడతావా? మనకు భగవంతుడు ఈ ప్రాణం ఎందుకు ఇచ్చినట్లు అంటున్నారు. కొంతమంది లౌక్యంగా మాట్లాడతారు, మంచి పనులు చేయరు. మలదోషం ఎలా పోతుంది అంటే నీ పని నీవు చేసుకొంటూ నీకు అవకాశం ఉంటే సమాజఋణం కొంత తీర్చుకొంటూ ఉంటే మలదోషం పోతుంది, రాగద్వేషాలు తగ్గిపోతాయి. 2. విక్షేపదోషం అంటే శరీరం ఒకచోట ఉంటే మనస్సు వేరొక చోట ఉంటుంది. శరీరం ఉన్న చోట మనస్సు ఉండదు. గాలివేస్తూ ఉంటే ఆకులు ఎలా కదులుతాయో అలా మనస్సు ఎప్పుడూ చలిస్తూ ఉంటుంది. చాలామందికి చదువు రాకపోవటానికి విక్షేపదోషం కారణం. శరీరం అక్కడే ఉంటుంది, మనస్సు పుస్తకం దగ్గర ఉండదు, ఎక్కడికో వెళ్ళిపోతూ ఉంటుంది. పనియందు మనస్సు పెట్టి చెయ్యాలి, అలా అందరూ చెయ్యలేరు, పని దగ్గర మనస్సు ఉండదు దానికి విక్షేపదోషం కారణం. ఈ విక్షేప దోషం ఎలా పోతుంది అంటే ధ్యానం చేయటం వలన, జపం చేయటం వలన విక్షేపదోషం పోతుంది. 3. ఆవరణదోషం అంటే దొడ్డి. నువ్వు ఎవరో నీకు తెలియకపోవటం వలన ఆవరణ దోషం వస్తుంది. వీరు నావారు, వారు పరాయివారు, వీరు నాకు మిత్రులు, వారు నాకు శత్రువులు అని ఏదో గోడ కడుతూ ఉంటుంది మనస్సు. నీకు ఆత్మ తాలుక ఎరుక లేకపోవటం వలన ఆవరణ దోషం వస్తుంది. జపధ్యానముల వలన, నిష్కామ కర్మ చేయటం వలన ఆవరణదోషం పోదు. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక నీకు కలిగే వరకూ ఆవరణదోషం పోదు. ఆత్మజ్ఞానసముపార్జన కలిగే వరకు ఆవరణదోషం నశించదు. విపశ్యన ట్రైనింగులు ఇస్తున్నారు కదా. విపశ్యన అంటే మీ లోపల ఉన్నది ఉన్నట్లుగా దర్శించటం. మీ లోపల ఏమి జరుగుతోందో చూసుకోండి. మీకు కోపం వస్తోంది అనుకోండి, కోపం వచ్చే ముందు తెలుస్తూ ఉంటుంది. మీకు కోరిక వస్తోంది అనుకోండి, కోరిక వచ్చే ముందు తెలుస్తూ ఉంటుంది. అది విజృంభించకుండా ఆర్పేయండి. మీ మనస్సులో ఏమి జరుగుతోందో ఉన్నది ఉన్నట్లుగా చూడండి.

కొంతమంది బుద్ధిమంతులు కానివారు కూడా మేము బుద్ధిమంతులం, మేము బుద్ధిమంతులం అనుకొంటారు. మీరు బుద్ధిమంతులు అవునో కాదో లోపల చూసుకోండి. మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోండి, చూసుకొని అందులో నుండి బయటకురావటానికి ప్రయత్నం చేయండి. మీ మనస్సులో ఏముందో ఇతరులకు తెలియకపోయినా, మీకు తెలుస్తు ఉంటుంది కదా. మీకు జ్ఞానం రావటానికి ఏవైతే అడ్డుగా ఉన్నాయో చూసుకొని, సాధన చేసి అందులోనుండి విడుదల పొందండి, అప్పుడు మీరు నిర్వాణసుఖాన్ని పొందుతారు. మీ లోపల ఉన్నది ఉన్నట్లుగా చూస్తూ ఉంటే లోపల ఉన్న కర్మ వాసనలు తెలుస్తూ ఉంటాయి. పూర్వజన్మలో మీరు చేసిన కర్మ వాసన కింద వస్తూ ఉంటుంది. కర్మ వాసనలు వస్తూ ఉంటాయి, రానివ్వండి, వద్దు వద్దు అనకండి. మీలో ఏమి ఉన్నాయో చూసుకోండి. రోగం తెలియకుండా ఉండటం కంటే రోగం తెలియటం మంచిది. పూర్వజన్మ వాసనలను బట్టి గబుక్కున ఎవరినైనా తిట్టాలనిపించింది అనుకోండి, నోరును ఆపు చేయండి. అప్పుడు ఏమి చేస్తుంది అంటే గాలివాన వచ్చినప్పుడు చెట్టు ఎలా ఊగుతుందో మీ మనస్సు అలాగ ఊపుతుంది. వాసనను బట్టి మీ నోరు ఆడకుండా చూసుకొంటే పూర్వజన్మ నుండి వచ్చిన కర్మవాసనలు అన్నీ ఈ జన్మలో నాశనమైపోతాయి. పూర్వజన్మ వాసనను బట్టి ఎవరికైనా అపకారం చేయాలనే బుద్ధి వచ్చేస్తుంది అనుకోండి, రానివ్వండి దానిని చూస్తూ ఉండండి, చేతులతో అపకారం చేసేయకండి. అప్పుడు కర్మవాసనలు నెమ్మదిగా నశించిపోతాయి. ఆ వాసనలు రానివ్వండి, వాటిని కంగారు పెట్టవద్దు, మీరు వాటిని యాక్షన్‌లో పెట్టవద్దు. అప్పుడు కర్మ వాసనలు నశించి పోతాయి. అప్పుడు మనస్సులో ఇంక పునర్జన్మ హేతువులు ఉండవు.

సృష్టి రకరకాలుగా ఉంటుంది. నీకు ఇష్టం వద్దు, అయిష్టం వద్దు. ప్రపంచంలో ఏ వస్తువు మీద, ఏ మనిషి మీద ఇష్టం వద్దు, అయిష్టం వద్దు. అలాగ ఉంటే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మీ ఇంట్లోవారు ఎవరు మీరు చెప్పినట్లుగా వినరు. మీ మనస్సే మీరు చెప్పినట్లు వినదు. లోకాన్ని ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి. ఇదొకరకమైన మాయ. నీ లోపల ఏమి జరుగుతోందో నువ్వు జాగ్రత్తగా చూసుకొని నువ్వు బాగుపడటం మానేసి, ఆ మైనస్ పాయింట్స్‌లో నుండి బయటకు రావటం మానేసి ఏదో లోకాన్ని ఉద్దరిస్తాను అంటావు. అసలు లోకం ఉందా నువ్వు ఉద్దరించటానికి. నీ మనస్సు ఎంత నిజమో లోకం కూడా అంతే నిజం. మనస్సు నశిస్తే లోకం నశిస్తుంది. మనం ఏదైనా పనిచేయాలంటే మనస్సులో సంకల్పం రావాలి. సంకల్పం లేకుండా పనిచేయము. ఈ సంకల్పాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఏదైతే ఏకమో, ఏదైతే అన్ని కాలాలలో అన్ని అవస్థలలో ఉందో, ఏదైతే

అఖండమో అక్కడ సంకల్పాలు లేవు. ఆ అఖండస్థితిని పొందేవరకు దేశకాలములు నిన్ను వెంటాడుతాయి, పుణ్యపాపములు, మంచి చెడ్డలు ఈ ద్వందాలు అన్నీ నిన్ను వెంటాడుతాయి అని ఐన్‌స్టీన్ చెప్పాడు. రమణమహర్షిగారికి మరణానుభవం రాకముందు మీరు తిట్టారు అనుకోండి, ఆయన తిట్టేసేవారు. మీరు కొట్టారు అనుకోండి, ఆయన నాలుగు కొట్టేవారు. ఆయనకు మరణానుభవం కలిగాక ఇంక మంచి లేదు, చెడు లేదు, ఇవ్వటం లేదు, పుచ్చుకోవటం లేదు, ఏమీ లేదు. నేను పుచ్చుకొన్నాను, నేను ఇచ్చాను అనుకొనేవాడు ఇంక అక్కడ లేడు దుఃఖం యొక్క స్పర్శ లేదు, భయం యొక్క ఎడ్రసు లేదు, ఇంక చావు పుట్టుకలు లేవు. దేహం చనిపోతే మృత్యువు. దేహం చనిపోయినప్పుడు లోపల ఒకడు ఉన్నాడు కదా నేను చనిపోతున్నాను అనివాడు అనుకొంటాడు. ఈ దేహం చనిపోకముందే నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అనుకొనేవాడు చనిపోతే అది మహామృత్యువు. వాడికి చావు వచ్చేవరకూ శవాలను మోయటం తప్పదు.

మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి మీకు కంగారు వస్తుంది. ఈ విశాలమైన సృష్టిలో సూర్యుడితో, చంద్రుడితో, దేవతలతో మనలను పోల్చుకొంటే మనం ఎంతటివారము, నీ శక్తి ఏపాటిది, నిన్ను విమర్శించిన వాడి శక్తి ఏపాటిది. అటునుండి వస్తే ఇదంతా దుమ్మే, ఇవన్నీ పోతాయి. మనం చనిపోతే ఈ ప్రపంచం ఉండదేమో అని అనుకోవద్దు. సూర్యుడు మామూలుగానే ఉదయిస్తాడు, మీరు చనిపోయారని ఉదయించటం మానడు. మీరు చనిపోతే పిల్లలు పాడైపోతారని అనుకోవద్దు. ఇంట్లో యజమాని చనిపోయాడు అని బాధ్యతగా పెరిగితే వారు ఇంకా బాగుపడవచ్చు. దేహానికి సంబంధించిన చావు పుట్టుకలు నిజం కాదు. ఈ గొడవలతో బ్రహ్మంకు ఎట్టి సంబంధం లేదు. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. మీకు సూక్ష్మబుద్ధి ఉంటే డైరెక్టుగా మనస్సుని నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీకు స్థూలబుద్ధి ఉంది అనుకో ప్రాణాయామం చేసి మనస్సును నిగ్రహించుకో. మనోనిగ్రహం వలన మనస్సు అణిగిపోతుంది. మనస్సు యొక్క విజృంభణను ఆపుచేయాలి. మనస్సు యొక్క విజృంభణ ఆగేకొలది కర్మవాసనలు సన్నగిల్లి రాలిపోతాయి. భగవంతుడు సర్వ శక్తిమంతుడు, సర్వ వ్యాపి. అందరి హృదయాలలోను ఉన్నాడు, ఈ సృష్టి అంతా వ్యాపించి ఉన్నాడు. ఈ జీవులను వారి వారి ప్రారబ్ధమునననుసరించి ఆడిస్తున్నాడు, అంతా ఆయనే, మనం లేము అని నీకు అర్థమైనప్పుడు ఈ నేను ఎందుకు పనికిరానిది అని నీకు తెలుస్తుంది. అప్పుడు దీనిని తేలికగా విడిచి పెట్టగలవు. ఇందులో ఏదో బంగారం ఉంది అని అనుకొంటే నువ్వు దానిని విడిచిపెట్టలేవు. తుకారామ్ అన్నాడు ఈ నేనును పోగొట్టుకోవటానికి నేను ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. ఓ పాండురంగా! నీయందు ప్రేమవలన, భక్తివలన, నీయందు విశ్వాసం వలన ఈ నేను పోయిన

మాట నిజం. ఎప్పుడుపోయిందో, ఎలా పోయిందో నాకు తెలియకుండానే ఈ నేనును పోగొట్టావు రంగా అంటాడు. అది భక్తి మార్గం, శరణాగతి మార్గం. జ్ఞానమార్గానికి వివేకం ఎక్కువ ఉండాలి. భక్తి మార్గానికి విశ్వాసం ఎక్కువ ఉండాలి. మీ ఆరోగ్యాన్ని ఎలా పోషించుకొంటున్నారో అలాగ ఈశ్వరుడి పాదాల పట్ల విశ్వాసాన్ని పోషించుకొంటే ఈ నేను మీకు తెలియకుండానే నశిస్తుంది. నాకు శ్వాసపోయినా ఇబ్బందిలేదు, ఈశ్వరుని పాదాలయందు విశ్వాసం పోకూడదు అని గాంధీగారు అనేవారు. శరణాగతి వాడి లక్షణం ఏమిటి అంటే ప్రతీ సంఘటనలోను ఈశ్వరుడిని చూస్తాడు, అక్కడ మనిషిని చూడడు. భరతుడు పంచవటి దగ్గరకు వచ్చి మా అమ్మ చాలా పొరపాటు చేసింది, నిన్ను అరణ్యవాసానికి పంపించింది, నీవు మరల అయోధ్యకు రావాలి, పరిపాలన చేయాలి అని రాముడితో అంటే, అప్పుడు రాముడు ఏమి చెప్పాడు అంటే ఇందులో మీ అమ్మ పొరపాటు ఏమీలేదు, ఆడించేవాడు ఈశ్వరుడు. అక్కడ రాముడు భరతుడి తల్లి కైకేయిని చూడటం లేదు, ఈశ్వరుడిని చూస్తున్నాడు. అది శరణాగతి లక్షణం. మనం అయితే ఎల్లయ్యనో, పుల్లయ్యనో చూస్తాము.

ఈమధ్య ఒక ముసలమ్మగారు చెప్పారు. కోడలు బాగా చూస్తే సంతోషం, చూడకపోయినా సంతోషమే అంటున్నారు. ఎందుచేతనంటే బాగా చూడకపోతే వారి మీద మమకారం పోతుంది, చనిపోయేటప్పుడు ఇంక వారు జ్ఞాపకం రారు. అలా చూడక పోవటం వలన కూడా మన బుద్ధిని బాగుచేసుకోవచ్చు. మన బుద్ధిని బాగుచేసుకోవటానికి వారు ఉపయోగపడుతున్నారు, అది వారికి తెలియదు. మాటలో ఏముంది అని మనం అనుకొంటాము. మాటలో కూడా దేవుడు ఉన్నాడు. మీరు బాగుపడటానికి ఒక్కమాట సరిపోతుంది. నామీద ఉన్న మోహం మీకు రాముడి మీద ఉంటే ఈపాటికి ఋషి అయిపోదురు అని తులసీదాసు భార్య తులసీదాసుతో అంది. ఆ మాటకు ఆయనకు కోపం రాలేదు. భార్య చెప్పిన మాట నిజమే అని ఒక్కసారి ఆయనకి జ్ఞానోదయం అయింది, వైరాగ్యం యొక్క శిఖరాలను అందుకొన్నాడు, ఆయనలో ఉన్న అజ్ఞానం రాలిపోయింది. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నావో ఆ మార్గం మీద నీకు విశ్వాసం ఉండాలి, ఆ మార్గం నిన్ను గమ్యానికి చేరుస్తుందనే నమ్మకం ఉండాలి. నిజమైన శరణాగతి ఎవడైతే పొందాడో వాడి దేహం ద్వారా ఏది జరుగుతున్నప్పటికి అది ఈశ్వరుడి సంకల్పమే అనుకొంటాడు. అందుచేత వాడికి దుఃఖంరాదు, నీ సంకల్పం అనుకొంటే దుఃఖం వచ్చేస్తుంది. భగవంతుడు మనలను ఆడిస్తున్నాడు అన్న సంగతి మీకు తెలియక తొందర పడుతున్నారు. నిన్ను, ఈ లోకాన్ని, మొత్తం సృష్టినంతా పరిపాలించే వ్యక్తి ఒకడు ఉన్నాడు, భగవంతుడంటూ ఒకడు ఉన్నాడు. మీకు ఆ విశ్వాసం ఉన్నప్పుడు శరణాగతి మార్గం మంచిది. నువ్వు భక్తి

మార్గంలో ప్రయాణించినా జీవుడు ఆత్మలో లయం అవ్వాలి. నీవు జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా ఈ నేను, నేను అనే తలంపు ఆత్మలో లయం అవ్వాలి. నువ్వు ఎలాగ వెళ్ళి అక్కడ లయం అయినా నువ్వు ఆత్మాకారం పొందిన వెంటనే అశాంతి, దుఃఖం వేరుతో సహా నశిస్తాయి. నీటిలోపడిన వెంటనే ఎలాగ తడిసిపోతామో అలాగ బ్రహ్మంలో ఐక్యమైన వెంటనే మరుక్షణంలో నీకు దుఃఖం, అశాంతి నశిస్తాయి. అంతేకాదు ఇంతవరకు నీవు మోస్తున్న శవాలు, నీ పూర్వజన్మలు అన్నీ అబద్ధం అన్న సంగతి నీకు గోచరిస్తుంది.

వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అని కొంతమంది మనిషి మనిషిని విభజించి చూస్తూఉంటారు, అలా వేరు చేస్తూ ఉంటారు. వారు దారం చేసే పని చెయ్యరు, సూది చేసే పని చేస్తూ ఉంటారు. అక్కడ సమన్వయం ఉండదు. ఏదో శరీరాన్ని చూసి, రంగును చూసి, గుణాలను చూసి అలా విడదీసుకొంటూ వెళ్ళిపోతారు. అందరిలోనూ బ్రహ్మం ఉంది అనే భావన అక్కడ లేదు. దీనికి నీలో ఉన్న పాపబుద్ధే కారణం అన్నారు భగవాన్. ఇలా మనిషినీ, మనిషినీ విడదీసుకొంటూపోతూ ఉంటే అది మామూలు పాపంకాదు, అది మహాపాపం అని చెప్పారు. ఇతరుల మీద తీర్పులు చెప్పటానికి నీవు ఎంతటి వాడివి, నీ జీవితం ఎంత, నీ అహంకారం ఏపాటిదని అందరిమీద తీర్పులు చెపుతున్నావు. మనం కూడా ఎదుటివారికి ఏదైనా చెపితే సలహా రూపంలో చెప్పాలి కాని విమర్శ రూపంలో చెప్పకూడదు, సలహా రూపంలో చెపితేవారు బాగుపడతారు. నువ్వు మంచి పనిచేస్తే సరిపోదు, ఆ మంచి పని కూడా మంచి బుద్ధితో చెయ్యి. భగవాన్ చెప్పిన ఈ మాటలను ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. భగవంతుడు ఎంత పవిత్రుడో నువ్వు భగవంతుడిని తెలుసుకొనే విధానం కూడా అంత పవిత్రంగా ఉండాలి. నువ్వు డబ్బు సంపాదించుకోవచ్చు కాని సంపాదించుకొనే విధానం కూడా పవిత్రంగా ఉండాలి. మీకు ఏవైనా కోరికలు ఉంటే అవి నెరవేర్చమని భగవంతుడిని ప్రార్థించవచ్చు, అందులో పొరపాటు లేదు. కాని ఇదిమటుకు గుర్తు పెట్టుకోండి. మీకు ఏ కోరిక లేదు అనుకోండి, భగవంతుడిపట్ల భక్తిగా ఉంటున్నారు అనుకోండి, పూర్తిగా విశ్వాసంగా ఉంటున్నారు అనుకోండి మీ విశ్వాసంలో, మీ భక్తిలో కామం లేదు అనుకోండి, మీరు అడగకుండానే మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. మీకు కోరిక ఉంటే భగవంతుడి అనుగ్రహం మీ కోరికకు పరిమితమైపోతుంది. ఆయన మీకు బిందెడు నీరు ఇద్దామని అనుకొంటున్నాడు అనుకోండి మీరు చెంబు తీసుకొని వెళితే ఏమి చేస్తాడు, ఆ చెంబుడు నీరు ఇచ్చి వెళ్ళిరమ్మంటాడు. అదే భగవాన్ చెపుతున్నారు అరుణాచలేశ్వరుడు అడిగిన వారికి అడిగినదే ఇచ్చి ఊరుకొంటాడు, అడగనివారికి అన్నీ ఇస్తాడు, మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు, వాడు దాత.

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**సద్గురు శ్రీ నాన్నగారితో రమణభక్తులు**

**మురుగునార్ శిష్యులు శ్రీ టి. కనకమ్మగారు**

# దృశ్యాలే దొంగలు - వాటికి దూరంగా ఉండాలి

నిత్య జీవితంలో అనుక్షణం సంఘటనలు, దృశ్యాలను గుర్తిస్తూ అవి కలిగించే కష్టసుఖాలను మరల మరల గుర్తు చేసుకొంటూ విశ్రాంతి, విచక్షణ లేకుండా పోవటంతో మనం చూసేది ఏమిటి? ఆలోచించేది ఏమిటి? అనే వివేకం లేక అవి అన్నీ నిజమనుకొంటున్నాము. అవి సత్యానికి నీడలు లాంటివి అనే అనుమానం కూడా రావటం లేదు. ఒక్క క్షణం ఆగి వీటి ప్రకృతి ప్రవాహాన్ని అసత్యమని అంతం చేస్తే ఈ సృష్టి ఎక్కడ ఉండగలదు. చైతన్యానికి ప్రపంచానికి సంబంధం విచిత్రమైనది. విషయాలను తెలియజేసే విషయంగా తనను తాను గుర్తించాలి, వాటికంటే తాను వేరని చూడగలగాలి వాటి విషయంలో కొంత అవగాహన ఉండి తీరాలి. ప్రకృతి మనుషులతో స్నేహాలు, ధన కాంక్ష, విషయ వాసనలు అన్నీ నిజంలా కనిపిస్తాయి. ఈ కల్పనకు మూలకారణమైన మనస్సును నమ్మి అవస్థల పాలౌతున్నాము. తుచ్ఛ భోగాలపై వైరాగ్య భావంతో ఉండాలి. ఇది అందంగా ఉంది, ఇది బాగాలేదు అనే ఆలోచనలే మన దుఃఖ సమూహానికి బీజాలు. ఆత్మజ్ఞానం అనే అగ్నితో ఆ బీజాలను దహిస్తే దుఃఖం ఉండదు. శ్రీనాన్నగారు అంటారు "మనస్సుతో చూడకు దానిలో పరిమితులు ఉన్నాయి. దానితో రాగద్వేషాలు అంటుకుంటాయి. నీవు ఆత్మవు" అని. మన మనస్సు వీడియో కెమెరావలె పనిచేస్తున్నది. కొన్ని దృశ్యాలను పోగుజేసుకొంటుంది. అంతులేని సీడీలను తయారుచేస్తూ తన గిడ్డంగిలో ఉంచుకొంటుంది. రోజూ మన సహస్రారమనే తెరమీద కొత్తవి, పాతవి, మరీ పాత చిత్రాలను, ముచ్చటగా మన ముందు ఉంచితే మనం చూస్తూ నిరంతరం స్పందిస్తూ ఉంటాము. అందుచేతనే జీవితం పట్ల నిజాయితీగా ఉండలేకపోతున్నాము. దృశ్యాలనే దొంగలు మన సాధనను దోచుకొనిపోతూ ఉంటే నిధి ధ్యాస మనకు ఎలా సాధ్యమౌతుంది. గాఢనిద్రలో ఈ చిత్రాలు విశ్రాంతి తీసుకొంటున్నాయి. ఎంతవరకూ విషయ భోగాలపైన, ప్రకృతి ప్రలోభాలపైన ఆశ ఉంటుందో అంతవరకు జీవ దశలోనే ఉంటాము. నిజం తెలియనంతకాలం ఈ ప్రభలమైన దృశ్యాలు నిరంతరం, తెంపులేకుండా కలుగుతూనే ఉంటాయి. గురు అనుగ్రహం మొండి ఏనుగు వంటి దృశ్యచలనాలకు అంకుశం లాంటిది, అప్పుడు మనం మన స్వాధీనంలో ఉండి సుఖిస్తాము. ఎన్నో విషయాలు మన చుట్టూ ఊరిస్తూ ఉంటాయి. అవి అన్నీ అవమానాలు కపటంతో ఉంటాయి, అమాయకంగా ఉంటే మోసపోతాము. మనం అసత్య జీవితంలో ఉంటే సత్యం ఎలా తెలుస్తుంది. సత్యంగా ఉంటే సత్యమే మన తలుపు తడుతుంది. అప్పుడు దృశ్యాలనే దొంగలు మన హృదయ ప్రాంగణం నుండి పారిపోతాయి. అప్పుడు ఆత్మ నిధికి వారసులు అవుతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం